

# పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

GST No.37ACDFM5465G1Z1

RNI-APTEL/2012/46499

No: KNL/3`78(D)/2026`2028

జూన్ 19వ తేదీ న నంద్యాల జిల్లా స్థాయి చెస్ పోటీలు.




Published From : KURNOOL circulated at Nandyal,Srikakulam,VishakaPatanam,Vijayanagaram,East Godavari ,West Godavari, Krishna, Guntur,Prakasam, Nellore,Chittoor, Kurnool,Kadapa,Anantapuram, Hyderabad

ఎడిటర్ : ఎం. మహేష్ యాదవ్ సంపుటి -14 సంచిక - 168 పేజీలు - 08 వెల - 05/-

బుధవారం 17-06-2026


# స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'లో ఏపీదే పేటెంట్

## సింగపూర్ పారిశ్రామికవేత్తలకు ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపు

- భారత్‌కు ఎకనమిక్ పవర్ హౌస్‌గా ఆంధ్రప్రదేశ్
- రెండో నివాసంగా అమరావతిని ఎంచుకోండి
- సీఐఐ పార్టనర్షిప్ సమ్మిట్ రోడ్ షోలో పాల్గొన్న సీఎం



సింగపూర్, జూన్ 16 భూమి, నీరు, మౌలిక వసతులు, అత్యుత్తమ పాలసీలతో పెట్టుబడులకు ఏపీ అత్యంత అనుకూల స్థానమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయడు అన్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు ఏపీదే పేటెంట్ అని, పెట్టుబడులకు ఎంతో సురక్షితమని స్పష్టం చేశారు. ఈ ఏడాది విశాఖలో తలపెట్టిన పార్టనర్షిప్ సమ్మిట్‌కు సన్నాహకంగా సింగపూర్‌లో సీఐఐ నిర్వహించిన బిజినెస్ రోడ్ షోలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... 'సింగపూర్‌తో భారత్‌కు, ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్‌కు మంచి సంబంధాలున్నాయి. సింగపూర్ నిర్మాత లీ క్వాన్ యూ అంటే నాకు చాలా అభిమానం. 3 దశాబ్దాలుగా సింగపూర్‌తో కలిసి పనిచేస్తున్నాం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో హైదరాబాద్‌లో సింగపూర్ టౌన్ షిప్‌నే నిర్మించాం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన తర్వాత కొత్త రాజధాని నిర్మాణం కోసం సింగపూర్ మాస్టర్ ప్లాన్ తయారు చేసి ఇచ్చింది. బ్లూ, గ్రీన్ రాజధానిగా ఓ అద్భుతమైన బృహత్ ప్రణాళికను సింగపూర్ రూపొందించి అందించింది. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతితో పాటు రాష్ట్రంలోని పట్టణాల అభివృద్ధి తదితర అంశాల్లో సింగపూర్ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నాం. పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ అత్యుత్తమ ప్రాంతం అని స్పష్టం చేస్తున్నా. సింగపూర్ పారిశ్రామిక వేత్తలు అమరావతిని, ఆంధ్రప్రదేశ్‌ను రెండో నివాసంగా ఎంచుకోవాలి.' అని అన్నారు.

**స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు**

'ఏపీలో పరిశ్రమలకు భూమి కేటాయింపు, అనుమతులను వేగంగా జారీ చేస్తున్నాం. ప్రపంచ దిగ్గజ స్టీల్ కంపెనీ అయిన ఆర్సెలార్ మిట్టల్‌కు అనతికాలంలోనే అన్ని అనుమతులు వేగంగా ఇచ్చాం. 2028 నాటికి ఆర్సెలార్ మిట్టల్ ఉత్పత్తి కూడా ప్రారంభించి

మిగతా 2లో




## పేపర్ లీక్‌లపై తీవ్ర ఆగ్రహం

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో, పేపర్ లీకేజీల కారణంగా తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యలకు పాల్పడిన విద్యార్థుల కుటుంబాలకు కోటి రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందించాలని

## అమెరికా-ఇరాన్ ఒప్పందంలో తెరవెనుక చక్రం తిప్పిన ఖతార్!




- అమెరికా, ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం
- ఒప్పందం వెనుక కీలక పాత్ర పోషించిన ఖతార్
- తిరిగి ప్రారంభం కానున్న హార్మూజ్ జలసంధి రవాణా
- జెనీవాలో ఒప్పందంపై అధికారికంగా సంతకాలకు సన్నాహాలు
- ప్రారంభ దశలో మధ్యవర్తిత్వం నెరిపిన పాకిస్థాన్

అమెరికా, ఇరాన్ దేశాల మధ్య గత వంద రోజులకు పైగా కొనసాగుతున్న తీవ్ర ఉద్రిక్తతలకు తెరపడే సూచనలు కనిపిస్తున్నాయి. ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం వెనుక ఖతార్

## వెలిగొండ నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ పరిహారం.

- అదనపు బడ్జెట్ లో 905 కేటాయించిన చంద్రబాబు.
- నల్లమలసాగర్ నింపడమే లక్ష్యంగా వెలిగొండ పనులు.
- టన్నెల్స్ లో లైనింగ్, టిబిఎం తొలగింపు ముమ్మరం.
- పనులు పరిశీలించిన మంత్రి నిమ్మల రామానాయుడు.




ఈనెలలో సిఎం చంద్రబాబు చేతుల మీదుగా వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ పరిహారం అందిస్తాం అని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. నల్లమలసాగర్ రిజర్వాయర్ లో నీళ్ళు నింపడానికి నిర్వాసితుల పునరావాసానికి అదనపు బడ్జెట్ లో 905 కోట్లు కేటాయించాం అని స్పష్టం చేశారు. మంగళవారం అధికారులతో కలసి డోర్నాల లో వెలిగొండ ప్రాజెక్టు

## రైతు సంక్షేమంలో ఆంధ్రప్రదేశ్ దేశానికే ఆదర్శం

- వైసీపీ హయాంలో బకాయిలు... కూటమి హయాంలో చెల్లింపులు



- ధాన్యం బకాయిలుగా ఉన్న రూ.1,674 కోట్ల చెల్లింపు
- రైతు ఆత్మహత్య బాధిత కుటుంబాలకు రూ.7 లక్షల ఎక్స్‌గ్రేషియా
- మామిడి, ఉల్లి, పొగాకు, కోకో రైతులకు రూ.588 కోట్ల సహాయం
- 22.5 లక్షల పంపుసెట్లకు 9 గంటల ఉచిత విద్యుత్
- రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నాం

మిగతాది 2లో

## 'దిశ' ఫెయిల్.. 'శక్తి' సక్సెస్

- ఏపీలో క్రైం రేటు 14.1 శాతం తగ్గిందన్న అనిత
- గత ప్రభుత్వ హయాంలో దిశ చట్టం అమలు కాలేదని విమర్శ




ఏ రాష్ట్రానికైనా పెట్టుబడులు, పరిశ్రమలు రావాలంటే అక్కడ శాంతిభద్రతలు పటిష్ఠంగా ఉండాలని ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. ఈరోజు నిర్వహించిన

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి: ఖర్గే



దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న నీట్ పరీక్ష వివాదంపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా స్పందించారు. వరుస పేపర్ లీకేజీలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని మంగళవారం డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా మోదీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. కోట్లాది మంది యువత భవిష్యత్తును అంధకారంలోకి నెట్టిన విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో ప్రధాని మోదీ ముందుగా రాజీనామా చేయించాలని ఖర్గే హితవు పలికారు. నీట్ పునఃపరీక్షకు

మిగతాది 2లో

## పిల్లల గుడ్లు, పప్పుల్లో రూ. 2 వేల కోట్ల స్కామ్..

### రేవంత్ అన్నదమ్ములే కోటీశ్వరులయ్యారంటూ హరీశ్ రావు ఫైర్!



- గురుకుల పాఠశాలల్లో భారీ కుంభకోణం జరిగిందన్న హరీశ్
- తమ శాఖల్లో ఏం జరుగుతోందో కూడా తెలియని స్థితిలో మంత్రులు ఉన్నారని ఎద్దేవా
- పిల్లలకు ఇచ్చే గుడ్లు, పప్పుల్లో కూడా స్కామ్ చేస్తారా అని మండిపాటు

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం టార్గెట్‌గా బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు విమర్శల డోస్ పెంచాయి. తాజాగా జరిగిన బీఆర్ఎస్ డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకుని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గురుకుల పాఠశాలల టెండర్లలో ఏకంగా రూ. 2,000 కోట్ల భారీ కుంభకోణం జరిగిందని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ విసిరిన సవాళ్లకు హరీశ్ రావు కౌంటర్ ఇచ్చారు. గురుకులాల్లో యూనిఫాంలు, టైల కోసం రూ. 1,200 కోట్లు.. ఉప్పులు, పప్పులు, చికెన్, గుడ్ల కోసం రూ. 800 కోట్లకు టెండర్లు పిలిచారని, ఈ రెండు కలిపితేనే రూ. 2,000 కోట్లు అవుతుందని లెక్కలు చెప్పారు. తమ శాఖల్లో ఏం జరుగుతుందో కూడా తెలియని స్థితిలో మంత్రులు ఉన్నారని ఎద్దేవా చేశారు. చివరకు గురుకులాల్లో చదువుకునే పేద పిల్లలకు పెట్టే గుడ్లు, పప్పుల్లో కూడా స్కామ్ చేస్తారా? అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశారు.

*ఎన్నికల ముందు కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తానని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని హరీశ్ రావు గుర్తుచేశారు. కానీ ఇప్పటివరకు రాష్ట్రంలో ఒక్క మహిళ కూడా కోటీశ్వరురాలు కాలేదని, అయితే రేవంత్ అన్నదమ్ములు మాత్రం కోటీశ్వరులయ్యారని ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రే స్వయంగా మొత్తం టెండర్లు పిలుస్తూ, ఆ నిధులన్నీ తన అన్నదమ్ములకే కట్టబెడుతున్నారని.. అందుకే ఈ వ్యవహారాలు రాష్ట్ర మంత్రులకు కూడా తెలియడం లేదని ఆరోపించారు*

## బీసీ బాలికల విద్యకు భరోసా

- ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీ, బైపీసీ తరగతుల్లో అడ్మిషన్లు



- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత
- 6 ఎంజేపీ స్కూళ్లను కళాశాలలుగా అప్ గ్రేడ్
- జీవో జారీచేసిన కూటమి ప్రభుత్వం
- ఈ విద్యా సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభం

అమరావతి : బీసీ బాలికల విద్యను ప్రోత్సహిస్తూ కూటమి ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఆరు మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల బాలికల పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసినట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఈ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. విజయనగరం జిల్లాలోని కొత్తవలస (బాలికల),

మిగతాది 2లో

## రూ.1.54 కోట్ల క్యాష్, కిలో బంగారం సీజ్

భూపరిపాలన శాఖ అధికారి నరహరి నివాసంలో ఏసీబీ



ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఆకస్మిక దాడులు రూ.5 కోట్లకు పైగా విలువైన ఆస్తులు గుర్తించినట్లు వెల్లడి

తెలంగాణ భూపరిపాలన, సర్వే విభాగంలో పనిచేస్తున్న ఒక ఉన్నతాధికారి నివాసంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) నిర్వహించిన సోదాల్లో భారీగా అక్రమాస్తులు వెలుగులోకి వచ్చాయి. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో సర్వే శాఖ మల్టీ జోన్-2 డిప్యూటీ డైరెక్టర్ సుంకరి నరహరిని ఏసీబీ

మిగతాది 2లో

# రైతు సంక్షేమంలో ఆంధ్రప్రదేశ్ దేశానికే ఆదర్శం

అమరావతి, జూన్ 16: రాష్ట్రంలోని రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి, రైతు కుటుంబాల ఆర్థిక భద్రత విషయంలో కూటమి ప్రభుత్వం అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరిస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను కొందరు రాజకీయ ప్రయోజనాల కోసం వక్రీకరిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రైతు ఆత్మహత్యల విషయంలో వైసీపీ సానుకూల పత్రికలో పనిగట్టుకుని అబద్ధాలను ప్రచురిస్తున్నారని మంత్రి మండిపడ్డారు. జూన్ 2024 నుండి ఇప్పటి వరకు 540 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారన్న ప్రచారం నిజం కాదని తెలిపారు. త్రిసభ్య కమిటీ విచారణ అనంతరం గత రెండేళ్ల కాలంలో 148 కేసులు మాత్రమే రైతు ఆత్మహత్యలుగా నిర్ధారణ అయినట్లు వెల్లడించారు. వ్యవసాయ కారణాల వల్ల బలవన్మరణానికి పాల్పడిన రైతుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.7 లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేస్తోందని తెలిపారు. ఇప్పటికే 148 కేసుల్లో 112 మంది రైతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా మంజూరు చేసేందుకు బిల్లులు సమర్పించామని, మిగిలిన కేసులను కూడా త్వరితగతిన పరిష్కరిస్తామని చెప్పారు. గత ప్రభుత్వంలో మరణించిన 81 మంది రైతులకు పరిహారం నగదు ఇవ్వలేదని కూటమి ప్రభుత్వం వచ్చినాక 5.67 కోట్ల నగదును సంబంధిత రైతుల కుటుంబాలకు చెల్లించామని మంత్రి తెలిపారు. రైతుల ఆర్థిక భద్రత కోసం కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ--పీఎం కిసాన్ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. ఈ పథకం ద్వారా ప్రతి అర్హత రైతు కుటుంబానికి సంవత్సరానికి రూ.20,000 ఆర్థిక సహాయం అందజేస్తున్నామని చెప్పారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం రూ.14,000, కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ ద్వారా రూ.6,000 అందజేస్తోందని వివరించారు. 2025--26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలోని 46.86 లక్షల రైతు కుటుంబాలకు మూడు విడతలుగా మొత్తం రూ.8,985.41 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.6,560.18 కోట్లు కాగా, కేంద్ర ప్రభుత్వ వాటా రూ.2,425.23 కోట్లు అని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతులకు చెల్లించాల్సిన ధాన్యం సేకరణ బకాయిలు పెండింగ్‌లో ఉండగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.1,674.47 కోట్ల పాత బకాయిలను పూర్తిగా చెల్లించి రైతులకు అండగా నిలిచిందని మంత్రి వెల్లడించారు. రైతు శ్రమ దోపిడీకి గురికాకుండా, ఆయన శ్రమ సంపదగా మారాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఏ ఒక్క రైతు కూడా నష్టపోకూడదన్న ఉద్దేశంతో ధరల స్థిరీకరణ నిధి ద్వారా విస్తృత సహాయం అందించామని తెలిపారు. గత బడ్జెట్‌లో రూ.300 కోట్లు కేటాయించినప్పటికీ, రైతుల ప్రయోజనాల కోసం దాదాపు రెట్టింపు స్థాయిలో రూ.588 కోట్లు ఖర్చు చేసి లక్ష మంది రైతులను ఆదుకున్నామని వివరించారు. తోతాపూరి మామిడి రైతులకు రూ.190 కోట్లు, కడప, కర్నూలు ఉల్లి రైతులకు కొనుగోలు చర్యల కోసం రూ.17.56 కోట్లు, ఉల్లి పంట నష్టపరిహారం కింద హెక్టారుకు రూ.25 వేల నుంచి రూ.50 వేలకు పెంచి రూ.128.33 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. అదేవిధంగా పొగాకు రైతులకు రూ.240 కోట్లు, కోకో రైతులకు రూ.12 కోట్లు చెల్లించి ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. 2026--27 ఆర్థిక సంవత్సరంలో ధరల స్థిరీకరణ నిధి కింద రూ.500 కోట్లు ప్రతిపాదించామని, అవసరమైతే రైతుల కోసం అదనపు నిధులు కూడా ఖర్చు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి స్పష్టం చేశారు. ఉచిత వ్యవసాయ విద్యుత్ పథకం ద్వారా రాష్ట్రంలోని 22.5 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు రోజుకు 9 గంటలపాటు నిరంతర పగటి ఉచిత విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ పథకంపై రూ.13,241.17 కోట్ల సబ్సిడీ వ్యయం జరిగినట్లు వెల్లడించారు. ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇప్పటి వరకు 68,988 కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేసినట్లు చెప్పారు. రాష్ట్ర ఉద్యానవన రంగం అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్న మంత్రి, రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు లక్ష కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టును కేంద్ర సహకారం, ప్రైవేటు పెట్టుబడులతో అమలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. పండ్ల ఉత్పత్తిలో 15.6 శాతం వాటాతో ఆంధ్రప్రదేశ్ దేశంలో మొదటి స్థానంలో ఉందని, ఆయిల్ పామ్, బొప్పాయి, నిమ్మ, కోకో, టమోటా, కొబ్బరి ఉత్పాదకతలో దేశంలో అగ్రస్థానంలో నిలిచిందని వెల్లడించారు. మిరప ఉత్పత్తిలో రాష్ట్రం రెండో స్థానంలో ఉందన్నారు. పామాయిల్ తోటల విస్తరణకు 2026--27లో రూ.204 కోట్లు ప్రతిపాదించామని, పశ్చిమ గోదావరి జిల్లాను కోకో హబ్‌గా అభివృద్ధి చేసి 'కోకో సిటీ' ఏర్పాటు ద్వారా చాక్లెట్ పరిశ్రమలను రాష్ట్రానికి తీసుకురావడానికి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. గత ప్రభుత్వ కాలానికి సంబంధించిన రూ.1,990.10 కోట్ల ప్రీమియం సబ్సిడీ బకాయిలు కూడా పెండింగ్‌లో ఉన్నాయి. ఈ పాపం జగన్ చేసిందే. మొదటి రెండేళు ఇచ్చారు అందులో 1990 కోట్లు బకాయి పెట్టారు, మిగతా మూడు ఏళ్ల ప్రీమియం కట్టలేదు. బకాయిని తిరిగి కట్టేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. సూక్ష్మసేద్యం అమలులో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రస్థానంలో ఉందని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత 5.5 లక్షల ఎకరాలను కొత్తగా సూక్ష్మసేద్య పరిధిలోకి తీసుకువచ్చామని మంత్రి పేర్కొన్నారు. రైతు సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి, గిట్టుబాటు ధరలు, నష్టపరిహారం, విద్యుత్, సాగునీరు, మార్కెటింగ్ సదుపాయాలు వంటి అన్ని అంశాల్లో ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. అసత్య ప్రచారాలను నమ్మకుండా రైతులు వాస్తవాలను గుర్తించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ఖరీఫ్ సాగుకు అవసరమైన ఎరువుల కొరత లేదని, రైతులకు సకాలంలో ఎరువులు అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందని మంత్రి కింజరాపు తెలిపారు. జూన్ 8వ తేదీ నుండి జూన్ 16వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా 95,506 మంది రైతులకు మొత్తం 4,77,501 ఎరువుల బస్తాలు విక్రయించినట్లు మంత్రి వెల్లడించారు. ఇందులో 3,56,916 యూరియా బస్తాలు, 1,20,585 డీఏపీ బస్తాలు రైతులకు అందించామని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఎరువులను అక్రమంగా అమ్ముకున్నారు, ఎరువులను రైతులకు అందచేసేందుకు ప్రత్యేక యాప్ ను తీసుకొచ్చాం, రాష్ట్రవ్యాప్తంగా సక్రమంగా ఎరువుల కొనుగోలు జరుగున్నాయని మంత్రి వెల్లడించారు

# వెలిగొండ నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ పరిహారం.

అధికారులతో కలసి డోర్నాల లో వెలిగొండ ప్రాజెక్టు జంట సొరంగాల్లోకి వెళ్ళి టన్నెల్ లైనింగ్, టన్నెల్ బోరింగ్ మెషిన్ తొలగింపు పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. వెలిగొండ ప్రాజెక్టు లో హెడ్ రెగ్యులేటర్ల రిటైనింగ్ వాల్, వింగ్స్, రిటర్న్స్ పనులు పూర్తి చేశాం అని తెలిపిన మంత్రి నిమ్మల కొల్లంవాగు నుండి 1 టిఎంసి నీరు టన్నెల్స్ లోకి చేరేలా 1.80లక్షల క్యూబిక్ మీటర్ల కు గానూ, ఇప్పటికి 58 వేల క్యూబిక్ మీటర్ల మక్ తొలగించాం అని, అదేవిధంగా టన్నెల్-1 లో నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న 1. 20 లక్షల క్యూబిక్ మీటర్ల మక్ తొలగింపు పనులలో ఇప్పటికి 40 వేల క్యూబిక్ మీటర్లు తొలగించాం అని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ 20 నెలలో టన్నెల్-2లో 7 కి.మీ లైనింగ్ కి గానూ, 5.5 కి.మీ లైనింగ్ పనులు పూర్తి చేశాం అని, మిగిలిన 1.5 కి.మీ లైనింగ్, జూలై చివరి నాటికి పూర్తి చేసేలా పనులు జరుగుతున్నాయి స్పష్టం చేశారు. 5 ఏళ్ళ వైసిపి పాలనలో హైకోర్టు ఆదేశాలతో టన్నెల్-2 లో చిక్కుకుపోయిన టన్నెల్ బోరింగ్ మెషిన్ వెలికితీత పనులు చేపట్టి, మొత్తం 7 కంపార్ట్మెంట్ లలో ఇప్పటికి 3 కంపార్ట్ మెంట్లు బయటకు తీసుకొచ్చాం అని టన్నెల్ బోరింగ్ మెషిన్ లో క్లిష్టమైన హెడ్ ను అక్కికక్కడే టన్నెల్ లోనే పూడ్చిపెట్టడానికి అవకాశాలు పరిశీలిస్తున్నాం అని పేర్కొన్నారు. ఫీడర్ కెనాల్ లో 5.3 కి.మీ రిటైనింగ్ వాల్ పనులు, జనవరిలో ప్రారంభించి నేటికి 5 నెలల్లో పూర్తి చేశాం అని తెలిపిన మంత్రి నిమ్మల, నత్తనడకన సాగుతున్న 21 కి.మీ లైనింగ్ పనులు వేగవంతం చేయాలని అధికారులు, ఏజెన్సీ ప్రతినిధులను ఆదేశించారు. మెంథా తుఫాన్ కారణంగా ఫీడర్ కెనాల్ లో పడిన భారీ గండికి సిసి వాల్ నిర్మించి పూర్తి చేయబోతున్నాం అని అన్నారు. తీగలేరు, ఈస్టర్న్ మెయిన్ కెనాల్స్ తో పాటు పర్మనెంట్ డైవర్షన్ రోడ్డు పనులు సైతం జూన్ నెలాఖరు నాటికి పూర్తికానున్నాయి అని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల ప్రకారం, సీజన్ మొదలయ్యే నాటికి నల్లమలసాగర్ రిజర్వాయర్ నింపేలా పనులు జరుగుతున్నాయి అని తెలిపారు. వైసీపీ నాయకులు వెలిగొండ కు బడ్జెట్ లో నిధులు కేటాయించడం లేదు అంటూనే వెనుకబడిన ప్రకాశం జిల్లా ప్రజలకు తమ గొడ్డలి పార్టీ నాయకుడు చేసిన మోసాన్ని ఒప్పుకున్నారని అన్నారు. 5ఏళ్లలో నిర్వాసితులకు ఒక్క రూపాయి కూడా కేటాయించకుండా వారిని ఇబ్బంది పెట్టారని, కూటమి ప్రభుత్వం అదనపు బడ్జెట్ లో నిధులు కేటాయించి వారికి అండగా నిలబడ్డామని స్పష్టం చేశారు. జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తో పాటు మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి, యర్రగొండపాలెం టిడిపి నియోజకవర్గం ఇంచార్జ్ ఎరిక్షన్ బాబు, జలవనరుల శాఖ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, వెలిగొండ ప్రాజెక్ట్ సీఈ రమేష్ బాబు, ఎస్.ఈ అబూతలేం, మరియు ఇతర ఉన్నతాధికారులు, ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'లో ఏపీదే పేటెంట్

ఏపీ నుంచి ఎగుమతులు చేస్తుంది. గూగుల్ క్లౌడ్ ఏఐ డేటా హబ్ కూడా ఏర్పాటు అవుతోంది. ఆ సంస్థకు గ్రీన్ ఎనర్జీని సరఫరా చేయాలని నిర్ణయించాం. పెట్టుబడులు వచ్చిన మరుక్షణం నుంచే పరిశ్రమలు ప్రారంభించేలా ఓ నిర్దిష్టమైన కాలవ్యవధిని నిర్ణయిస్తున్నాం. గూగుల్‌తో పాటు దాదాపు 10 గిగావాట్ల సామర్థ్యం ఉన్న డేటా సెంటర్లను వివిధ కంపెనీలు ఏర్పాటు చేయబోతున్నాయి. ఎల్జీ ఎలక్ట్రానిక్స్ కూడా రూ.7 వేల కోట్లతో శ్రీసిటీలో గృహోపకరణాల తయారీ యూనిట్‌ను ప్రారంభించనుంది. నైపుణ్యం ఉన్న మానవ వనరులను తయారు చేసేందుకు ఆపరేషనల్ స్కిల్ యూనివర్సిటీని కూడా ఏర్పాటు చేస్తున్నాం. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా టెక్నాలజీ విస్తృతి పెరిగింది. దీని ఆధారంగానే నిర్ణయాలు ఉంటున్నాయి. ఏపీలోనూ అదే తరహాలో డేటా డ్రివెన్ నిర్ణయాలను తీసుకుని పౌరసేవల్ని అందిస్తున్నాం

**ప్రపంచ ఆర్థిక శక్తిగా భారత్**

వికసిత్ భారత్ 2047 విజన్‌లాగే స్వర్ణాంధ్ర 2047 విజన్‌కు రూపకల్పన చేశాం. త్వరలోనే భారత ఎకనామిక్ పవర్ హౌస్‌గా ఆంధ్రప్రదేశ్ మారుతుంది. ప్రపంచ ఆర్థిక శక్తిగా భారత్ వేగంగా ఎదుగుతోంది. సుదీర్ఘమైన తీరప్రాంతం, అరుదైన ఖనిజాలు, పర్యాటక ప్రాంతాలు ఏపీ సొంతం. ఆక్వా, హార్టికల్చర్, వ్యవసాయం, సేవల రంగంలో ఏపీ కీలకమైన రాష్ట్రంగా ఉంది. దేశంలోనూ, రాష్ట్రంలోనూ సుస్థిరమైన ప్రభుత్వాలు ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న భౌగోళిక రాజకీయ పరిస్థితుల కారణంగా వివిధ దేశాలు సంక్షోభాలను ఎదుర్కొంటున్నాయి. పూర్తి స్థాయి సన్నద్ధతతో ఈ సంక్షోభాన్ని కూడా భారత్ సమర్థంగా ఎదుర్కోగలిగింది. ఏపీ నుంచి ఎగుమతులు పెంచేందుకు మేం విస్తృతంగా ప్రయత్నాలు చేస్తున్నాం. దీనికి అనుగుణంగా పోర్టులు, ఎయిర్ పోర్టులు సిద్ధం చేస్తున్నాం. రాష్ట్ర అభివృద్ధి కోసం స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికల ద్వారా ఆర్థిక అసమానతలు తొలగించేలా పనిచేస్తున్నాం. పారిశ్రామిక అనుకూల పరిస్థితులను కల్పించేలా 26 పాలసీలు అమలు చేస్తున్నాం. ఏపీలో భూమి లభ్యత, నీటి లభ్యత ఉంది. కృష్ణా, గోదావరి నదుల ద్వారా వివిధ ప్రాంతాలకు నీటి సరఫరా ఉంది. పారిశ్రామికంగా మౌలిక సదుపాయాలను పెద్ద ఎత్తున కల్పిస్తున్నాం" అని ముఖ్యమంత్రి అన్నారు.

**గ్లోబల్ నగరాలకు ఏపీ కనెక్టివిటీ** 'ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి ఒక్కరినీ వ్యాపారవేత్తలుగా మార్చేందుకు వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్ అనే విధానం తెచ్చాం. అలాగే ఎంఎస్ఎంఈ సహా వివిధ పరిశ్రమల్లో తయారయ్యే ఉత్పత్తుల నాణ్యతపై కూడా దృష్టి పెట్టాం. రియల్ టైమ్ గవర్నెన్సు ద్వారా ఎక్కడా జాప్యం లేకుండా అనుమతులు వేగంగా వచ్చేలా చూస్తున్నాం. ఏపీకి ఉన్న వెయ్యి కిలోమీటర్లకు పైగా తీర ప్రాంతంలో 6 ఆపరేషనల్ పోర్టులు ఉన్నాయి. ఈ పోర్టులను దేశంలోని వివిధ ప్రాంతాలకు, విదేశీ పోర్టులకు కనెక్టు చేసేలా ప్రయత్నాలు చేస్తున్నాం. 7 ఆపరేషనల్ ఎయిర్ పోర్టులు ఏపీలో ఉన్నాయి. భోగాపురం లాంటి అంతర్జాతీయ విమానాశ్రయంతో గ్లోబల్ నగరాలకు కనెక్టివిటీ ఏర్పడుతుంది. లాజిస్టిక్స్, అగ్రికల్చర్, సివిల్ ఏవియేషన్, ఎనర్జీ లాంటి వివిధ అంశాల్లో ఫంక్షనల్ యూనివర్సిటీలను ఏర్పాటు చేస్తున్నాం. ఏపీలో ఉన్న పోర్టులను దేశంలోని ఇతర ప్రాంతాలు అనుసంధానించేలా రహదారి, రైల్ నెట్వర్క్‌ను కూడా పెద్ద ఎత్తున నిర్మిస్తున్నాం. ఎలక్ట్రానిక్స్, స్పేస్, ఏరోస్పేస్, డ్రోన్, డిఫెన్స్ క్లస్టర్లతో పాటు రాష్ట్రంలోని 175 చోట్ల నియోజకవర్గ ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నాం. ఈ పారిశ్రామిక పార్కులకు నీరు, విద్యుత్ లాంటి మౌలిక సదుపాయాలు కూడా సిద్ధంగా ఉన్నాయి. రాయలసీమలోని పుట్టపర్తి వద్ద 5వ తరం ఫైటర్ జెట్ తయారీ, టెస్టింగ్ ఫెసిలిటీ కూడా వస్తోంది. ఈవీల వినియోగం పెంచటం ద్వారా కాలుష్యాన్ని తగ్గించేలా ప్రయత్నాలు చేస్తున్నాం' అని ముఖ్యమంత్రి అన్నారు.

**నాలెడ్జ్ హబ్‌గా అమరావతి**

'అమరావతిని ఎడ్యుకేషన్, నాలెడ్జ్ హబ్‌గా తయారు చేయటంతో పాటు దేశంలోని ప్రధాన నగరాలను కనెక్ట్ చేస్తాం. హైస్పీడ్ రైల్ నెట్వర్క్ కూడా అమరావతిని హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై లాంటి నగరాలను కనెక్టు చేస్తుంది. బ్లూ, గ్రీన్ సిటీగా అమరావతిని నిర్మించటం తోపాటు ఈవీల వినియోగం, గ్రీన్ ఎనర్జీని వినియోగించేలా చర్యలు తీసుకుంటున్నాం. అమరావతిలోనే ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ సంస్థలు 133 క్యూబిట్ క్వాంటం కంప్యూటర్ ను ఏర్పాటు చేస్తున్నాయి. ఈ ఏడాది డిసెంబరు నాటికల్లా క్వాంటం అమరావతిలో కంప్యూటర్ పనిచేయటం ప్రారంభిస్తుంది. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా ఆవిష్కరణల్ని, స్టార్టప్‌లను ప్రోత్సహిస్తున్నాం. ప్రాజెక్టులు పెట్టే వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా మా ప్రభుత్వం సహకారం అందిస్తుంది. త్వరలోనే విశాఖ సమీపంలో సెమీకండక్టర్ పరిశ్రమ ఏర్పాటు అయ్యే అవకాశం ఉంది. ఏపీలో అద్భుతమైన పర్యాటక ప్రాంతాలు కూడా ఉన్నాయి. దేవాలయాలు, పర్యాటక, బుద్దిస్ట్ సర్క్యూట్‌లు ఉన్నాయి. ఆక్వా, వ్యవసాయం, హార్టికల్చర్‌లో ఏపీ అగ్రస్థానంలో ఉంది. పెద్ద ఎత్తున ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు అవకాశం ఉంది. పెద్దఎత్తున ప్రకృతి సేద్యం ద్వారా వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులను పండిస్తున్నాం. ఏపీకి వచ్చి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ను పరీక్షించి అప్పుడు పెట్టుబడులు పెట్టాలని పిలుపునిస్తున్నాను. పెట్టుబడులు పెట్టడానికి ఇది సువర్ణ అవకాశం. ఇండియా గ్రోత్ స్టోరీలో భాగస్వాములు కావాలని కోరుతున్నాను' అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.

# బీసీ బాలికల విద్యకు భరోసా

అన్నమయ్య జిల్లాలోని కలికిరి (బాలికల), వైఎస్సార్ కడప జిల్లాలోని ఓనిపెంట (బాలికల), ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాలోని ఆత్మకూరు (బాలికల), శ్రీ సత్యసాయి జిల్లాలోని నాసనకోట (బాలికల) ఎంజేపీ గురుకులాల పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా ప్రభుత్వం అప్ గ్రేడ్ చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రారంభమైన నూతన విద్యా సంవత్సరం నుంచి ఈ ఆరు గురుకుల కళాశాలల్లో మొదటి ఇంటర్ ఎంపీసీ, బైపీసీ గ్రూపులు ప్రారంభం కానున్నాయన్నారు. ఒక్కో గ్రూపులో 40 మంది విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించనున్నట్లు తెలిపారు. ఒక్కో గురుకుల కళాశాలలో ఎనిమిది అధ్యాపకులను పార్ట్ టైమ్ పద్ధతిలో నియమించనున్నామన్నారు. వారితో ఒక కుక్ ను, ల్యాబ్ అసిస్టెంట్ ను అవుట్ సోర్సింగ్ విధానంలో నియమించనున్నట్లు తెలిపారు. ఆయా గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లు కళాశాల ప్రిన్సిపాళ్లగా అప్ గ్రేడ్ చేస్తున్నట్లు మంత్రి సవిత తెలిపారు. **సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు** :-బీసీ బాలికల విద్యకు ప్రోత్సహిస్తూ ఆరు గురుకుల పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేయడంపై మంత్రి సవిత హర్షం వ్యక్తంచేశారు. ఎంజేపీ గురుకులాల విద్య కోసం విద్యార్థులకు, వారి తల్లిదండ్రుల నుంచి విపరీతమైన డిమాండ్ ఉందన్నారు. నాణ్యమైన విద్య, భోజనం, వసతి సౌకర్యాలు లభిస్తుండడంతో, రాష్ట్ర వ్యాప్తంగా ఎంజేపీ గురుకులాల్లో విద్యనభ్యసించడానికి విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారన్నారు. ప్రజల నుంచి వస్తున్న డిమాండ్ తో పాటు బాలికల విద్యకు వెన్నుదన్నుగా నిలుస్తూ ఆరు ఎంజేపీ స్కూళ్లను అప్ గ్రేడ్ చేసినందుకు సీఎం చంద్రబాబుకు మంత్రి సవిత ధన్యవాదాలు తెలియజేశారు. త్వరలో రూ.500 కోట్లతో పది ఎంజేపీ గురుకులాలకు శాశ్వత భవనాలు నిర్మించబోతున్నట్లు తెలిపారు.

## అమెరికా-ఇరాన్ ఒప్పందంలో తెరవెనుక చక్రం తిప్పిన ఖతార్!

కొనసాగుతున్న తీవ్ర ఉద్రిక్తతలకు తెరపడే సూచనలు కనిపిస్తున్నాయి. ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం వెనుక ఖతార్ జరిపిన నిరంతర, రహస్య దౌత్యం కీలక పాత్ర పోషించినట్లు అంతర్జాతీయ కథనాలు వెల్లడిస్తున్నాయి. ఈ ఒప్పందంతో కీలకమైన హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవడంతో పాటు, అణు చర్చల పునరుద్ధరణకు మార్గం సుగమం కానుంది. ఈ ఒప్పందంపై త్వరలోనే తటస్థ వేదికైన జెనీవాలో అధికారికంగా సంతకాలు జరగనున్నాయి. ఒప్పందం నిబంధనల ప్రకారం, ఇరు పక్షాలు తక్షణమే కాల్పుల విరమణను పాటించాల్సి ఉంటుంది. దీనితో పాటు, ప్రపంచ ఇంధన సరఫరాకు అంతరాయం కలిగించిన హర్మూజ్ జలసంధిలో నౌకల రాకపోకలను పునరుద్ధరించనున్నారు. కొన్ని ధ్రువీకరించదగిన చర్యలకు ప్రతిఫలంగా ఇరాన్‌పై ఉన్న ఆంక్షలను దశలవారీగా సడలించేందుకు కూడా అంగీకారం కుదిరింది. 2026 ప్రారంభం నుంచి అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య చోటుచేసుకున్న సైనిక చర్యలతో ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు పరాకాష్ఠకు చేరాయి. చర్చల ప్రారంభ దశలో పాకిస్థాన్ చొరవ తీసుకుని ఇరు దేశాల మధ్య సంప్రదింపులకు వేదిక కల్పించింది. అయితే, అణు పరిమితులు, యురేనియం నిల్వలు వంటి క్లిష్టమైన సాంకేతిక అంశాలపై ఏకాభిప్రాయం సాధించడంలో ఆ ప్రయత్నాలు పూర్తిస్థాయిలో ఫలించలేదు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో ఖతార్ రంగంలోకి దిగింది. అమెరికా, ఇరాన్ దేశాలతో సత్సంబంధాలు కలిగిన ఖతార్ రాయబారులు, ఇరు దేశాల మధ్య రహస్య మంతనాలు జరిపి, ఒప్పందంలోని సంక్లిష్టాంశాలపై ఏకాభిప్రాయం సాధించడంలో సఫలమయ్యారు. హర్మూజ్ జలసంధిని తిరిగి తెరిచేందుకు, నావికాదళ దిగ్బంధనాన్ని సడలించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ధ్రువీకరించారు. నెలల తరబడి కొనసాగిన అనిశ్చితి తర్వాత ఈ ఒప్పందం ఒక చారిత్రాత్మక ముందడుగుగా దౌత్యవేత్తలు భావిస్తున్నారు.

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి: ఖర్గే

ముందుగా రాజీనామా చేయించాలని ఖర్గే హితవు పలికారు. నీట్ పునఃపరీక్షకు సంబంధించి మెసేజింగ్ యాప్ టెలిగ్రామ్‌ను తాత్కాలికంగా నిలిపివేయడాన్ని ఆయన తప్పుబట్టారు. అసలు సమస్య మూలాలను పరిష్కరించకుండా, ప్రశ్నపత్రాల రవాణాకు భారత వైమానిక దళాన్ని ఉపయోగించడం, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లను నిరోధించడం వంటి చర్యలతో ప్రభుత్వం చేతులు దులుపుకుంటోందని ఆరోపించారు. పేపర్ లీకేజీల వెనుక ఉన్న అసలు సూత్రధారులను వదిలేసి, చిన్న చిన్న వ్యక్తులను మాత్రమే అరెస్టు చేస్తున్నారని విమర్శించారు.గత పదేళ్లలో సుమారు 90 పేపర్ లీకులు జరిగాయని, దీనివల్ల ప్రభుత్వ ఉద్యోగాలు, ఉన్నత విద్య కోసం ఆశపడ్డ 9 కోట్ల మంది యువత భవిష్యత్తు నాశనమైందని ఖర్గే ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కుంభకోణాల కారణంగా దాదాపు అర డజను మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని గుర్తుచేశారు. నీట్, ఎస్ఎస్‌సీ, యూజీసీ-నెట్, సీయూఈటీ వంటి పరీక్షల కోసం తల్లిదండ్రులు అప్పులు చేసి కోచింగ్‌లకు పంపిస్తే, వారి పిల్లల కలలు పేపర్ లీక్‌లతో కల్లలవుతున్నాయని అన్నారు. ఇటీవల సీబీఎస్ఈ ఫలితాల వివాదంలో 17-18 ఏళ్ల విద్యార్థులు సైతం రోడ్లపైకి వచ్చి నిరసన తెలపాల్సి రావడం వ్యవస్థ వైఫల్యానికి నిదర్శనమని ఖర్గే పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రతిష్ఠాత్మక యూపీఎస్సీ పరీక్షల విశ్వసనీయతపై కూడా సందేహాలు తలెత్తుతున్నాయని ఆయన వ్యాఖ్యానించారు. దేశంలోని యువత ఒక్కటే కోరుకుంటోందని, అది ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అని ఖర్గే స్పష్టం చేశారు. ఈ విషయంలో బీజేపీ ప్రభుత్వం విఫలమైందని ఆయన దుయ్యబట్టారు.

## నీట్ బాధిత కుటుంబాలకు రూ.కోటి పరిహారం ఇవ్వాలి

కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే డిమాండ్ చేశారు. ప్రశ్నపత్రాల లీకేజీల వల్ల తీవ్ర మానసిక ఒత్తిడికి లోనై తనువు చాలించిన పలువురు విద్యార్థుల కుటుంబాలను ఆయన ఇటీవల పరామర్శించారు. ఆయా కుటుంబాలన్నీ ప్రస్తుతం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని, వ్యవస్థలోని లోపాలకు తమ పిల్లలు బలికావడంతో వారు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం తక్షణమే స్పందించి, బాధిత కుటుంబాల ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు ఒక్కో కుటుంబానికి కోటి రూపాయల పరిహారం అందించాలని ఆయన కోరారు. భవిష్యత్తులో మరే విద్యార్థి కూడా ఇటువంటి నిస్సహాయ స్థితికి గురికాకుండా ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వ్యవస్థలోని లోపాల వల్ల విద్యార్థుల జీవితాలు బలికావడం అత్యంత విషాదకరమని, దీనికి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని ఆయన స్పష్టం చేశారు. నాగ్‌పూర్‌లో ఆత్మహత్యకు పాల్పడిన నీట్ విద్యార్థిని ఆకాంక్ష చతుర్వేది కుటుంబాన్ని అభిజీత్ పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. ఈ కష్టకాలంలో వారికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. భవిష్యత్తులో మరే విద్యార్థి ఇటువంటి దుస్థితికి గురికాకుండా చూడాలని, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తక్షణమే ఆర్థిక సహాయం ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు.

## రూ.1.54 కోట్ల క్యాష్, కిలో బంగారం సీజ్

అధికారులు అరెస్ట్ చేశారు. మంగళవారం ఉదయం హైదరాబాద్‌తో పాటు మొత్తం 11 ప్రాంతాల్లో అధికారులు ఏకకాలంలో ఈ దాడులు నిర్వహించారు. ఏసీబీ డీఎస్పీ గంగసాని శ్రీధర్ నేతృత్వంలోని బృందాలు ఈ సోదాలు చేపట్టాయి. హైదరాబాద్ పాతబస్తీ ఛత్రినాకలోని నరహరి నివాసం, నారాయణగూడలోని ఆయన కార్యాలయంతో పాటు బంధువులు, సన్నిహితుల ఇళ్లలో తనిఖీలు జరిగాయి. ఈ క్రమంలో నరహరి ఇంట్లోని బెడ్‌రూమ్‌లో ఉన్న బీరువా పైభాగంలో దాచిన రూ.1.54 కోట్ల నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు సుమారు ఒక కిలో బంగారం, పలు కీలక ఆస్తి పత్రాలను కూడా సీజ్ చేశారు. స్వాధీనం చేసుకున్న ఆస్తుల ప్రభుత్వ విలువ సుమారు రూ.5 కోట్లకు పైగా ఉంటుందని, బహిరంగ మార్కెట్ విలువ అంతకు అనేక రెట్లు ఎక్కువగా ఉండే అవకాశం ఉందని ఏసీబీ అధికారులు భావిస్తున్నారు. కోటి రూపాయలకు పైగా విలువైన ఫిక్స్‌డ్ డిపాజిట్లు, బ్యాంకు లాకర్లను కూడా అధికారులు గుర్తించారు. వాటికి సంబంధించిన పూర్తి వివరాల కోసం బ్యాంకులకు లేఖలు రాశారు. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న ఫిర్యాదుల నేపథ్యంలో ప్రాథమిక విచారణ జరిపిన ఏసీబీ ఈ చర్యలు చేపట్టింది. అరెస్ట్ చేసిన నరహరిని న్యాయస్థానంలో హాజరుపరచనున్నారు. ఆయన కుమారుడి పేరుతో ఉన్న స్థిరాస్తుల వివరాలపై కూడా అధికారులు ఆరా తీస్తున్నారు. ప్రస్తుతం ఈ కేసులో తదుపరి విచారణ కొనసాగుతోంది. నగదును బెడ్ రూమ్‌లోని బీరువా పైన ఉన్న కబోర్డులో గుర్తించినట్లు ఏసీబీ డీఎస్పీ తెలిపారు. ఏసీబీ దాడుల చరిత్రలో ఒకేచోట ఇంత భారీ మొత్తంలో నగదు లభించడం అరుదని ఆయన పేర్కొన్నారు. సుంకరి నరహరిని అరెస్టు చేశామని, రేపు కోర్టులో హాజరుపరుస్తామని ఆయన వెల్లడించారు.

# జూన్ 19వ తేదీ న నంద్యాల జిల్లా స్థాయి చెస్ పోటీలు.

**శ్రీ రామకృష్ణ డిగ్రీ కాలేజ్ స్వామి వివేకానంద ఆడిటోరియంలో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా జట్ల ఎంపిక.**



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. ఆంధ్ర చెస్ అసోసియేషన్ నిర్వహించబోయే రాష్ట్రస్థాయి చెస్ పోటీలలో పాల్గొనే జిల్లా జట్ల ఎంపిక కోసం నంద్యాల జిల్లా చెస్ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 19 వ తేదీ , శుక్రవారం ఉదయం 9 గంటల నుండి శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాల స్వామి వివేకానంద ఆడిటోరియం లో నంద్యాల జిల్లా స్థాయి అమెచ్యూర్ చెస్ పోటీలు నిర్వహించడం జరుగుతుందని నంద్యాల జిల్లా చెస్ అధ్యక్షులు, ఆంధ్ర చెస్ అసోసియేషన్ వైస్ చైర్మన్ డాక్టర్. జి. రవికృష్ణ, కార్యదర్శి రామసుబ్బారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 18 వ తేదీ సాయంత్రం 6 గంటల లోపు ఏపీ చెస్ వెబ్సైట్లో ఎంట్రీలు నమోదు చేసుకోవాలని నంద్యాల జిల్లా ఎంపికైన క్రీడాకారులు త్వరలో జరగబోవు రాష్ట్రస్థాయి చదరంగా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంట్రీలు నమోదు చేసుకోవడానికి, ఇతర వివరాలకు 9010451585 కు సంప్రదించాలని తెలిపారు..

# పంచాయతీ మోటారు రిపేరు చేయించి నీటి సమస్యను పరిష్కరించండి సిపిఎం



ఆదోని (పల్లె వెలుగు): ఈరోజు ఆదోని మండలం గణేకల్లు గ్రామంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మండల కార్యవర్గ సభ్యుడు బి వీరారెడ్డి మాట్లాడుతూ గ్రామంలో ఊరు బావి వద్ద పంచాయతీ మోటారు పనిచేయక దాదాపు 5 నెలలు కావస్తున్నా ఇప్పటివరకు ఆ మోటార్ రిపేర్ చేయించలేదు. ఇప్పటికైనా అధికారులు మోటార్ రిపేర్ చేయించి సమస్యను పరిష్కరించాలని సిపిఎం పార్టీగా డిమాండ్ చేస్తున్నాము. ఈ యొక్క సమస్యను పరిష్కరిస్తే అక్కడ పశువులకు నీళ్లు తాగడానికి అదేవిధంగా ఎవరైనా చనిపోతే అంత్యక్రియలకు పోయి ఇక్కడకు వచ్చి కాలకృత్యాలు తీర్చుకొని పోతారు. ఇప్పుడు మోటర్ రిపేర్ రావడం వల్ల అంత్యక్రియలకు పోయి వచ్చినవారు అక్కడ నీళ్లు లేక కొంతమంది నీళ్లు ట్యాంకర్లు ఏర్పాటు చేయడం అదేవిధంగా కొంతమంది వాటర్ నీళ్ళ ప్యాకెట్లు తెచ్చుకొని కాలకృత్యాలు తీర్చుకొని పోయే పరిస్థితి ఉందని కాబట్టి తక్షణమే మోటార్ రిపేర్ చేయించి నీటి సమస్యను పరిష్కరించాలని సిపిఎం పార్టీగా డిమాండ్ చేస్తున్నాము ఈ కార్యక్రమంలో పెద్ద సుంకయ్య, బంగారయ్య, రాజు, నరసింహులు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# బాలికల ప్రవేశాల అర్హతపై పరీక్ష పరిశీలన




దొర్నిపాడు జూన్ 16 పల్లె వెలుగు న్యూస్ దొర్నిపాడు మండలంలోని అమ్మిరెడ్డి నగరం గ్రామంలో గలకస్తూర్బా గాంధీబాలికల పాఠశాలలోప్రవేశాలపైబాలికలకు ఉపాధ్యాయులుపరీక్షలు,విద్యార్థతలనుపరిశీలిస్తున్నట్లుపాఠశాల, ఎస్ ఓ,జయమణి తెలిపారు, ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలలో ఆరవ తరగతి నుండి ఇంటర్ ప్రవేశాల కొరకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకొని పాఠశాలలో చేరేందుకు వస్తున్న బాలికల విద్యార్థతలను పరిశీలించేందుకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు,చదువులోవారికిఉన్నసామర్థ్యాన్ని ఉపాధ్యాయులు అడిగి తెలుసుకుంటున్నారన్నారు,పిల్లలు చదువులపట్ల శ్రద్ధ వహించే విధంగతల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు,ప్రతితరగతినందు 40మందిబాలికలుఉంటారన్నారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాఠశాల సిబ్బంది, బాలికలు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు

# నారాయణ యాదవ్ కు అండగా ఉంటాం

**-పుత్తా నరసింహ రెడ్డి**



కడప. జూన్ 15 . (పల్లె వెలుగు): కడప నియోజకవర్గం లోని చింతకొమ్మ దీన్నే మండలం లోని బిసిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీ కి చెందిన అప్పారాజుపల్లి గ్రామానికి చెందిన నారాయణ యాదవ్ కి అనారోగ్యంతో కడప నగరంలోని ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్న ఆయన్ను పుత్తా నరసింహ రెడ్డి మరియు ఆ గ్రామపంచాయతీ నాయకులు పరామర్శించారు.

# ఎటీఎంల వద్ద రాత్రి వేళల్లో గట్టి నిఘా: కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో జిల్లాలోని అన్ని



బ్యాంకు ఎటీఎంల వద్ద రాత్రి వేళల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేసి, గట్టి నిఘా ఉంచనున్నట్లు కర్నూలు జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ (ఎస్పీ) విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల కాలంలో ఎటీఎం కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న నగదు చోరీలు, కార్డు స్కిమ్మింగ్, సైబర్ మోసాలు మరియు ఇతర నేరపూరిత కార్యకలాపాలను అరికట్టేందుకే జిల్లా వ్యాప్తంగా ఈ ప్రత్యేక నిఘా ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ స్పష్టం చేశారు.

**పోలీసు అధికారులకు కీలక ఆదేశాలు**

“అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని ఎటీఎంలను రాత్రి



సమయాల్లో పోలీసులు నిరంతరం తనిఖీ చేయాలి. ఎటీఎంల వద్ద అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తులు లేదా అనుమానాస్పద వస్తువులు కనిపిస్తే తక్షణమే రంగంలోకి దిగి చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.” అని ఎస్పీ విక్రాంత్ పాటిల్ పోలీసు అధికారులను ఆదేశించారు.

**బ్యాంకు యాజమాన్యాలకు సూచనలు**

ఎటీఎంల భద్రతపై బ్యాంకు నిర్వాహకులు కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎస్పీ సూచించారు. ప్రతి ఎటీఎం కేంద్రంలోనూ అధునాతన సీసీ కెమెరాలు పనిచేసేలా చూడాలి. అత్యవసర సమయాల్లో అలర్ట్ చేసే అలారం వ్యవస్థలను ఏర్పాటు చేయాలి. రాత్రి వేళల్లో తప్పనిసరిగా భద్రతా సిబ్బంది (సెక్యూరిటీ గార్డ్స్) అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి.

**వినియోగదారులకు హెచ్చరికలు.. జాగ్రత్తలు!**

ప్రజలు ఎటీఎంల ద్వారా నగదు విత్‌డ్రా చేసుకునే సమయంలో అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కోరారు. మీ పిన్ (గ్రా×చీ) నంబర్‌ను టైప్ చేసేటప్పుడు ఇతరులకు కనిపించకుండా గోప్యంగా ఉంచుకోవాలి. ఎటీఎం కేంద్రాల్లో నగదు డ్రా చేసేటప్పుడు ఎలాంటి అపరిచితుల సహాయం తీసుకోకూడదు. ఎటీఎం మెషిన్ల వద్ద ఏవైనా వింత పరికరాలు అమర్చినట్లు గమనించినా, లేదా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు గానీ, లేదా డయల్-100 / 112 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ జిల్లా ప్రజలను కోరారు.

# హోంమంత్రి అనితపై అనుచిత వ్యాఖ్యలు

## : గుడివాడ అమర్నాథ్ చిత్రపటానికి కోడిగుడ్లతో కొట్టి ‘తెలుగు మహిళల’ వినూత్న నిరసన!

**ఆగ్రహం వ్యక్తం చేసిన రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కమ్మరి పార్వతమ్మ**

- అమర్నాథ్ వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలి
- తల్లిని, చెల్లిని దూషించి తరిమేసిన సంస్కృతి వైసీపీది
- మహిళలను గౌరవించే నారా లోకేష్ వెంటే మేమంతా..





పల్లె వెలుగు కర్నూలు బ్యూరో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోంమంత్రి శ్రీమతి వంగలపూడి అనితపై వైసీపీ నాయకుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై తెలుగు మహిళలు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మంగళవారం కర్నూలు పట్టణం, కల్లూరు మండలం 41వ వార్డు వీకర్ సెక్షన్ కాలనీలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం ముందు తెలుగు మహిళలు భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. హోంమంత్రిపై అడ్డగోలుగా మాట్లాడిన గుడివాడ అమర్నాథ్ చిత్రపటాలపై కోడిగుడ్లు విసురుతూ, చెప్పులతో కొడుతూ వినూత్న రీతిలో తమ నిరసనను, తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. అమర్నాథ్‌పై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నినాదాలతో హోరెత్తించారు.

**మహిళలను అగౌరవపరచడమే వైసీపీ నైజం!**

ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్, నంద్యాల పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు కమ్మరి పార్వతమ్మ మాట్లాడుతూ.. వైసీపీ నాయకులకు మహిళల పట్ల కనీస గౌరవం లేదని మండిపడ్డారు. ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పి గద్దె దించినా వారి వైఖరిలో మార్పు రాలేదని ధ్వజమెత్తారు. “సొంత తల్లిని, చెల్లిని సైతం దూషించి, నడిరోడ్డుపై నిలబెట్టి, పార్టీ నుంచి బహిష్కరించిన చరిత్ర మీ నాయకుడు వైయస్ జగన్మోహన్ రెడ్డిది. అలాంటి పార్టీ నాయకుల నుంచి మహిళా గౌరవాన్ని ఆశించలేం. అందుకే నేడు ఆంధ్రప్రదేశ్‌లోని మహిళలందరూ వైసీపీని శాశ్వతంగా బహిష్కరించి, కూటమి ప్రభుత్వానికి బ్రహ్మరథం పడుతున్నారు” అని ఆమె ఘాటుగా విమర్శించారు.

‘యత్ర నార్యస్తు పూజ్యంతే’.. మా లోకేష్ బాబును చూసి నేర్చుకోండి!

“యత్ర నార్యస్తు పూజ్యంతే- రమంతే తత్ర దేవతాః” (ఎక్కడ స్త్రీలు పూజించబడతారో అక్కడ దేవతలు నివసిస్తారు) అనే నానుడిని పాటిస్తూ.. ప్రతి మహిళను ఒక తల్లిగా, సొంత చెల్లెలిగా గౌరవిస్తున్న ఏకైక యువ నాయకుడు నారా లోకేష్ బాబు అని మహిళా నేతలు కొనియాడారు. మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని వరమిచ్చిన మహానాయకుడు లోకేష్ బాబును చూసైనా వైసీపీ నేతలు బుద్ధి తెచ్చుకోవాలని హితవు పలికారు. మాటల్లో వర్ణించలేని విధంగా బూతులు తిడుతూ, సంస్కారహీనంగా వ్యవహరిస్తున్న గుడివాడ అమర్నాథ్ తక్షణమే రాష్ట్ర మహిళా లోకానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో ఆయనకు తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు.

భారీగా పాల్గొన్న నేతలు, కార్యకర్తలు

ఈ వినూత్న నిరసన కార్యక్రమంలో తెలుగు మహిళలు రాధిక, సునీత, వరలక్ష్మి, బీబీ, పద్మావతి, కళావతి, మద్దమ్మ, సుబ్బమ్మ, కృష్ణవేనమ్మ, ఉసేనమ్మతో పాటు 37వ వార్డు ఇన్‌ఛార్జ్ సుతారు రాఘవేంద్ర, టీడీపీ నాయకులు భూపాల్, సుబ్బరాయుడు, వెంకటేష్, బాలకృష్ణ, అనిల్, విజయ్, బసన్న, రామాంజనేయులు మరియు పెద్ద సంఖ్యలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, మహిళలు పాల్గొని తమ సంఘీభావాన్ని ప్రకటించారు.

# అమర్నాథ్ దిష్టిబొమ్మకు నిప్పు అంటించిన మహిళలు

కొలిమిగుండ్ల ( జూన్ 16 పల్లె వెలుగు న్యూస్ )ప్రతినిధి :- నంద్యాల దిష్టిబొమ్మకు నిప్పంటించి కాల్చడం జరిగినది. ఈ కార్యక్రమంలో




జిల్లా కొలిమిగుండ్ల మండలంలో గుడివాడ అమర్నాథ్ దిష్టిబొమ్మకు నిప్పు అంటించిన మహిళలు వివరాల్లోకి వెళితే, కొలిమిగుండ్ల మండల అధ్యక్షుడు మూలే రామేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు కోటపాడు శివరామిరెడ్డి ఆధ్వర్యంలో గుడివాడ అమర్నాథ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఈరోజు స్థానిక కొలిమిగుండ్ల బస్టాండ్ ఆవరణంలో అమర్నాథ్ యొక్క దిష్టిబొమ్మను టమోటాలు, కోడిగుడ్లతో తన దిష్టిబొమ్మను కొట్టడం తరువాత అమర్నాథ్ మహిళలు మాట్లాడుతూ హోంమంత్రి వంగలపూడి అనిత పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు గుడివాడ అమర్నాథ్ క్షమాపణలు చెప్పాలని మహిళలు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేశారు. క్షమాపణలు చెప్పని ఎడల గుడివాడ అమర్నాథ్ ఇంటి ముందర ధర్నా కార్యక్రమాలు నిరసనలు తెలియపరుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, తెలుగుదేశం పార్టీ మహిళలు, కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనడం జరిగినది.

# నేతాజీ హాస్టల్‌లో ఉచిత ప్రవేశాలు.



పల్లె వెలుగు నంద్యాల రూరల్. నంద్యాల పట్టణంలోని వైఎస్సార్ నగర్‌లో ఉన్న నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆవాసీయ విద్యాలయ హాస్టల్‌లో 2వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థుల ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హాస్టల్ నిర్వాహకులు తెలిపారు. చదువుకు దూరంగా ఉన్న పిల్లలు, అణగారిన వర్గాల పిల్లలు, బాల కార్మికులు, వీధి బాలలు, అనాథలు, నిరాశ్రయ పిల్లలకు ఉచితంగా వసతి, భోజనం, విద్యా సౌకర్యాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. యోగ, కంప్యూటర్, టైలరింగ్ శిక్షణతో పాటు మినరల్ వాటర్, వేడి నీటి సౌకర్యాలు, సీసీ కెమెరాల పర్యవేక్షణలో వసతి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆసక్తి గల తల్లిదండ్రులు, స్వచ్ఛంద సంస్థలు, అధికారులు విద్యార్థులను చేర్పించవచ్చని, వివరాలకు హాస్టల్ వార్డెన్ 9704353075ను సంప్రదించాలని సూచించారు.

# శ్రీనివాస నగర్ ప్రధాన రహదారి

## వైట్‌టాప్ నిర్మాణంలో ప్రభుత్వ శాఖల సమన్వయ లోపం.

**ప్రమాదంలో మరణించిన ఇమాంసా కుటుంబానికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి.**

- ప్రజా సమస్యలపై పౌర సమాజం స్పందించాలి.
- బొజ్జా దశరథరామిరెడ్డి



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. శ్రీనివాస నగర్ ప్రధాన రహదారిలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కార్పెంటర్‌గా జీవనోపాధి పొందుతూ తన పేద కుటుంబానికి ఆధారంగా ఉన్న ఇమాంసా మృతి చెందడం అత్యంత బాధాకరమైన సంఘటన అని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి అన్నారు. మృతుడి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం నంద్యాల సమితి కార్యాలయం నందు దశరథరామిరెడ్డి మాట్లాడుతూ శ్రీనివాస నగర్ ప్రధాన రహదారిలో తారు రహదారి స్థానంలో వైట్‌టాప్ (సిమెంట్) రహదారి నిర్మాణ పనులు చేపట్టిన నేపథ్యంలో వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపం, నిర్మాణ ప్రాంతంలో తగిన భద్రతా చర్యలు లేకపోవడం, అలాగే వాహన డ్రైవర్ నిర్లక్ష్యం కలిసి ఈ ప్రమాదానికి కారణమైనట్లు స్థానిక ప్రజలు అభిప్రాయపడుతున్నారని ఆయన పేర్కొన్నారు.

నంద్యాల పట్టణంలోని అత్యంత కీలకమైన ప్రధాన రహదారులలో ఒకటైన ఈ రోడ్డులో గత మూడున్నర నెలలుగా నిర్మాణ పనులు కొనసాగుతున్నప్పటికీ, కనీసం ఒక వైపు రహదారిని కూడా ప్రజల రాకపోకలకు అందుబాటులో ఉంచలేకపోవడం విచారకరమన్నారు. ట్రాఫిక్ నియంత్రణ, ప్రత్యామ్నాయ మార్గాల ఏర్పాటు, హెచ్చరిక బోర్డుల ఏర్పాటు, పాదచారుల భద్రత వంటి అంశాల్లో సంబంధిత శాఖలు తగిన చర్యలు తీసుకోలేదన్నారు. ఆర్ ఉ బి శాఖ, మున్సిపాలిటీ, ట్రాఫిక్ పోలీసులు మరియు ఇతర సంబంధిత విభాగాల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ రహదారి పరిసర ప్రాంతాల్లో అనేక ఆసుపత్రులు, మెడికల్ షాపులు ఉండటంతో ప్రతిరోజూ రోగులు, వృద్ధులు, మహిళలు, చిన్నారులు అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తున్నారని, నిర్మాణ పనులను క్రమబద్ధంగా మరియు వేగవంతంగా పూర్తి చేయడంలో విఫలమవడం వల్ల ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారని అన్నారు. పరిస్థితి తీవ్రతను గమనించినప్పటికీ సంబంధిత శాఖలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఆందోళన కలిగిస్తోందన్నారు.

ప్రజా సమస్యలపై అప్రమత్తంగా స్పందించాల్సిన రాజకీయ పార్టీలు కూడా పరస్పర విమర్శలకే పరిమితమై, ప్రజా భద్రత వంటి కీలక అంశాలపై సమిష్టి బాధ్యతతో వ్యవహరించలేకపోతున్నాయని ఆయన విమర్శించారు. ఇలాంటి సందర్భాల్లో పౌర సమాజం, ప్రజాస్వామ్యవాదులు, సామాజిక చైతన్యవంతులు కలిసి ప్రజా ప్రయోజనాల కోసం పనిచేసే వేదికలను నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. నంద్యాల పట్టణ ప్రముఖులు ఈ దిశగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

ఇమాంసా మరణానికి దారితీసిన పరిస్థితుల్లో ప్రభుత్వ శాఖల నిర్లక్ష్యం కూడా ఒక కారణమని భావిస్తున్నందున, ఆయన కుటుంబానికి ప్రభుత్వం కనీసం రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి ఆర్థిక భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై ఉన్నతస్థాయి విచారణ జరిపి భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు.

*"అభివృద్ధి పనులు ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారకూడదు. ప్రజల భద్రతకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేయడం ప్రభుత్వ శాఖల బాధ్యత. మృతుడి కుటుంబ సభ్యులకు మరోసారి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను"* అని బొజ్జా దశరథరామిరెడ్డి అన్నారు.

# వివాదాస్పదంగా డ్రైనేజీ నిర్మాణం



బండి ఆత్మకూరు పల్లె వెలుగు జూన్ 16: బండి ఆత్మకూరు లోని ఆరవ వార్డులో నిర్మిస్తున్న డ్రైనేజీ నిర్మాణం వివాదాస్పదంగా మారింది. 10 సంవత్సరాల క్రితం ఈ ప్రాంతంలో 100 మీటర్లకు పైగా సిమెంట్ రోడ్డును నిర్మించడం జరిగింది. అప్పుడు నిర్మించిన సిమెంట్ రోడ్డుకు డ్రైనేజీ లేకపోవడంతో సిమెంట్ రోడ్లకు సంబంధించిన మిగులు నిధులతో డ్రైనేజీ నిర్మించాలని అధికారులు నిర్ణయించుకున్నారు. గత మూడు రోజుల నుండి ఈ ప్రాంతంలో డ్రైనేజీ ఏర్పాటుకు గాను రోడ్డు కిరుపక్కల గుంతలు తీశారు. అయితే గుంతలు తీసే విషయంలో ఈ ప్రాంతంలో ప్రజల మధ్య మనస్పర్ధలు ఏర్పడి ఘర్షణకు దారి తీసే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ విషయంపై కొందరు వ్యక్తులు మంగళవారం పోలీసులను ఆశ్రయించారు. ఇరువురు పోలీసులు ఈ ప్రాంతానికి చేరుకొని ప్రజలను సర్ది చెప్పే ప్రయత్నం చేసినప్పటికీ వారి వినకపోగా వారితో కూడా వాగ్వివాదానికి దిగడంతో పోలీసులు అక్కడి నుండి వెనుతిరిగారు. ఈ సంఘటన తాసిల్దార్, గ్రామ స్పెషల్ ఆఫీసర్ అయిన పద్మావతమ్మ దృష్టికి రావడంతో, వెంటనే పంచాయతీ కార్యదర్శి అక్బర్ తో కలిసి ఈ ప్రాంతానికి చేరుకున్నారు. తాసిల్దార్ వద్ద కూడా ప్రజలు మాట మాట పెంచుకోవడంతో, అసహనానికి గురయ్యారు. కార్యదర్శి చెప్పిన మేరకే తాము గుంతలు తీసేందుకు ఒప్పుకున్నామని, తీరా గుంతలు తీశాక, ఈ విషయంపై నోరుమెదకపోవడం పట్ల కొందరు ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. ముందుగా ఇరు ప్రక్కల కొలతలు వేయకుండా డ్రైనేజీ పనులు ఎలా మొదలు పెట్టారని స్పెషల్ ఆఫీసర్ ప్రశ్నిస్తూ, ఈ విషయంపై చర్చించి చర్యలు తీసుకుంటామని స్పెషల్ ఆఫీసర్ పద్మావతమ్మ ఆ ప్రాంత ప్రజలకు తెలియజేశారు.

# మహిళా రైతులకుకేత్ బచావో అభియాన్ పై అవగాహన కార్యక్రమం




దొర్నిపాడు జూన్ 16 పల్లె వెలుగు న్యూస్ కేంద్ర ప్రభుత్వఆదేశాల మేరకు భూపరిరక్షణకు,కేత్ బచావో అభియాన్ పై మహిళా రైతులకు అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం కృషి విజ్ఞాన కేంద్రం యాగంటి పల్లి వారి ఆధ్వర్యంలో నిర్వహించినట్లు మండల వ్యవసాయ అధికారిని ప్రమీల తెలిపారు,కార్యక్రమం ఈ జూన్ నెలమొత్తంనిర్వహించడం జరుగుతుందన్నారు,కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రమణయ్య మాట్లాడుతూ నేలను ఆరోగ్యంగా ఉంచుకోవడానికి భూసార పరీక్ష చేయించుకోవాలని, భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులు వాడాలని, అధిక మోతాదు లో వాడుటవలనపంటతీసుకోదు అలాగే భూమిలో ఉండటం, లేదా ఆవిరి రూపం లో గాలిలో కలిసి పోతుంది తద్వారా వాతావరణ కాలుష్యం తో పాటు రైతుకు పెట్టుబడిపెరుగుతుంది అన్నారు,కావున మోతాదు కు మించి ఎరువులు వాడరాదని తెలిపారు.మండల వ్యవసాయ అధికారిప్రమీలమాట్లాడుతూ ఈ సీజన్ నుంచి ప్రభుత్వం వారి ఆదేశాల మేరకు యూరియా మరియు ణూరా ఖజూఖఅఎం ఖజూజూ ద్వారా శాస్త్రవేత్తల సిఫార్సు మేర మాత్రమే పంపిణీ చేయడం జరుగుతుంది అన్నారు , రైతులకు అవసరమైన మేర ఎరువులు అందుబాటులో ఉన్నాయని భరోసానిచ్చారు. అనంతరం ఏపిఎం,బాబు మాట్లాడుతూ పొదుపు సంఘాల లో ఉన్న మహిళలకు కుట్టు మిషన్, టైలరింగ్ పై ఆసక్తి ఉన్నవారు వెలుగు కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు, ఈ కార్యక్రమంలో కె వి కె నుండి లక్ష్మీ ప్రియ, వెలుగు ఏ,పీ,ఎం,డి, బాబు వ్యవసాయ శాఖ సిబ్బంది,ఘాజచీఫ్ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

# వెంగళపురం ఆంజనేయస్వామి దేవాలయ పాలకమండలి ప్రమాణ స్వీకారం

- ఆధ్యాత్మిక సేవతో ఆలయ అభివృద్ధికి కృషి చేయాలి
- టిడిపి ఇంచార్జి మీనాక్షి నాయుడు.



ఆదోని (పల్లె వెలుగు): ఆదోని నియోజకవర్గ టిడిపి ఇంచార్జి మీనాక్షి నాయుడు ఆదేశాల మేరకు శ్రీ వెంగళపురం ఆంజనేయస్వామి దేవాలయ నూతన పాలకమండలి ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. భక్తుల గోవింద నామస్మరణల మధ్య ఆలయ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమానికి గ్రామ పెద్దలు, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా దేవాలయ పాలకమండలి చైర్మన్‌గా పాడేగల్ శ్రీధర్ ప్రమాణ స్వీకారం చేయగా, పాలకమండలి సభ్యులుగా ఐ.సి. రామలక్ష్మి, భీమస్వామి మరియు ఇతర సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. ఆలయ సంప్రదాయాల ప్రకారం ప్రత్యేక పూజలు నిర్వహించి, నూతన కమిటీ సభ్యులకు ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, శ్రీ వెంగళపురం ఆంజనేయస్వామి దేవాలయం భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తోందని, నూతన పాలకమండలి ఆలయ అభివృద్ధి, పారదర్శక పాలన, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆకాంక్షించారు. ఆలయ ఆస్తుల పరిరక్షణతో పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించి, దేవాలయ ప్రతిష్ఠను మరింత పెంపొందించే దిశగా కృషి చేయాలని సూచించారు. టిడిపి ఇంచార్జి మీనాక్షి నాయుడు నాయకత్వంలో నియోజకవర్గ వ్యాప్తంగా అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధికి కూడా ప్రాధాన్యత ఇస్తున్నట్లు నాయకులు పేర్కొన్నారు. నూతన పాలకమండలి సభ్యులు తమపై ఉంచిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించి, భక్తుల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా సేవలు అందిస్తామని ఈ సందర్భంగా సంకల్పం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, ఆలయ అర్చకులు, మహిళలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని నూతన పాలకమండలికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# హవ్వ! ఇదేమి విడ్డూరం

## - ఉపాధి కూలిలతో హౌసింగ్ గ్రామసభ



**బండిఆత్మకూరు పల్లెవెలుగు జూన్ 17:**




బండి ఆత్మకూరు సచివాలయంలో మంగళవారం హౌసింగ్ అధికారులు నిర్వహించిన గ్రామసభ అభాసు పాలయింది. గత రెండు సంవత్సరాల నుండి నూతన గృహాల మంజూరు కొరకు లబ్ధిదారులు ఆశగా ఎదురుచూస్తున్న నేపథ్యంలో, గ్రామాలలో నాలుగు నెలల క్రితం హౌసింగ్ అధికారులు పక్కా గృహాల ఎంపిక కొరకు గ్రామాలలో సర్వే నిర్వహించారు. అర్హులైన లబ్ధిదారులను గుర్తించి కొద్దికాలం క్రితమే మంజూరు కొరకై ప్రభుత్వానికి ప్రతి పాదనలు పంపడం జరిగింది. వడపోత కార్యక్రమం అనంతరం బండి ఆత్మకూరు మండలానికి 1092 దరఖాస్తులలో 875 గృహాలు మంజూరు కాగా 217 గృహాలు వివిధ కారణాల కారణంగా తిరస్కరణకు గురయ్యాయి. మంజూరైన గృహాలకు సంబంధించి ఈ నెల 12వ తేదీ నుండి ఆయా గ్రామాలలో సభలు నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా హౌసింగ్ అధికారులు నిర్వహించే గ్రామసభలు మొక్కుబడిగా నిర్వహిస్తున్నారు. లబ్ధిదారుల ఎంపిక విషయంలో ప్రభుత్వం సూచించిన మార్గదర్శక సూత్రాలను హౌసింగ్ అధికారులు ఏమాత్రం పాటించడం లేదు. గ్రామాలలోని నలుగురు నాయకులను పోగుచేసి మొక్కుబడిగా గ్రామసభలు నిర్వహించినట్లు ఫోటోలు తీసుకుని చేతులు దులుపుకున్నారు. అయితే మంగళవారం బండి ఆత్మకూరు లో నిర్వహించిన గ్రామసభ విమర్శలకు దారి చేసింది. గ్రామ సభ నిర్వహించే ముందు గ్రామంలో దండోరా వేసి, లబ్ధిదారులను గ్రామసభకు హాజరుకావాలని హౌసింగ్ అధికారులు చెప్పాల్సి ఉంది. అయితే గ్రామంలో ఇందుకు సంబంధించి ఎలాంటి దండోరా వేయించలేదు. గృహాలు మంజూరైన లబ్ధిదారులకు ఎలాంటి సమాచారం అందజేయలేదు. కేవలం పత్రికలకు మాత్రం సమాచారం అందజేసి హౌసింగ్ అధికారులు మమ అనే రీతిలో వ్యవహరించారు. గ్రామసభను ఏదో రీతిలో నిర్వహించాలి కాబట్టి, అందుకు అనుగుణంగా సచివాలయ కార్యాలయాన్ని గ్రామసభకు వేదికగా చేసుకున్నారు. విచిత్రం ఏమిటంటే గ్రామ సభకు ఎంపికైన లబ్ధిదారులు ఎవరు హాజరు కాలేదు. ప్రతి గ్రామ సభకు టంచెనుగా హాజరయ్యే నలుగురు నాయకులు మాత్రం సమావేశానికి ముందే హాజరయ్యారు. నిర్ణీత సమయానికి గ్రామసభ నిర్వహించకపోవడంతో సమావేశానికి వచ్చిన కొద్దిపాటి మహిళలు ఎదురుచూపులు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. 11 గంటల తర్వాత ప్రారంభమైన గ్రామసభలో సచివాలయ సిబ్బంది మాత్రం సభలో కూర్చుండిపోయారు. ఆ తర్వాత ఉపాధి పనులు చేసే కూలీలు మాత్రం చక చకా గ్రామసభకు చేరుకొని కుర్చీలలో ఆసీనులయ్యారు. బండి ఆత్మకూరు గ్రామానికి 103 మందికి గృహాలు మంజూరు కాగా, అందులో కేవలం ఇద్దరు మహిళలు మాత్రమే హాజరు కావడం వింత కొలుపుతూ ఉంది. సమావేశానికి హాజరు అయిన ఉపాధి కూలీలను ప్రశ్నిస్తే, ఫీల్డ్ అసిస్టెంట్ నాగరాజు తమను గ్రామ సభకు రమ్మని చెప్పడంతో ఇక్కడికి రావడం జరిగిందని పలువురు ఉపాధి కూలీలు పేర్కొనడం గమనార్హం. మంజూరైన గృహాలకు సంబంధించిన నివేదికను ఇంజనీరింగ్ అసిస్టెంట్ చదువుతూ ఉండగా, ఎవరు కూడా నోరు మెదపకపోవడం వింతగొ లుపుతూ ఉంది. గృహాల మంజూరు విషయంలో ఎంపికైన లబ్ధిదారులు హాజరు కాకపోవడంతో స్పెషల్ ఆఫీసర్ పద్మావతమ్మ హౌసింగ్ అధికారుల పనితీరు పట్ల అసహనం వ్యక్తం చేశారు. లబ్ధిదారులకు సమాచారం అందజేయడంలో ఎందుకు అలసత్వం ప్రదర్శించారని స్పెషల్ ఆఫీసర్ హౌసింగ్ అధికారులపై కాసింత మండిపడ్డారు. లబ్ధిదారులను సమావేశానికి రప్పించకుండా ఉపాధి కూలీలను రప్పించడంలో అధికారుల అంతర్యం ఏమిటో అంతుపట్టడం లేదు. తూతు మంత్రంగా గ్రామసభను నిర్వహించారని లబ్ధిదారులు హౌసింగ్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమను కాకుండా ఉపాధి కూలీలను గ్రామ సభకు రప్పించడం ఏమిటి? హవ్వ! ఇదెక్కడి విడ్డూరం! అంటూ లబ్ధిదారులు హౌసింగ్ అధికారుల పనితీరు పట్ల విమర్శలు గుప్పిస్తున్నారు. బహిరంగంగా నిర్వహించాల్సిన గ్రామసభను నాలుగు గోడల చాటున మధ్యన సచివాలయంలో నిర్వహించడం ఏమిటని లబ్ధిదారులు ప్రశ్నిస్తూ ఉండటం కొసమెరుపు. యోగ కార్యక్రమానికి సంబంధించి ప్రజలను ఆన్లైన్లో నమోదు చేయించాలని కలెక్టర్ నుండి ఆదేశాలు రావడంతో, నమోదుకు వచ్చిన ఉపాధి కూలీలను హౌసింగ్ శాఖ నిర్వహించిన గ్రామసభలో కూర్చోబెట్టడం మరో కొస మెరుపు.

# ఓటర్ నమోదు ప్రక్రియ

## పారదర్శకంగా నిర్వహించాలి:తహసీల్దార్





మహానంది, పల్లె వెలుగు ఓటరు నమోదు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి, జాబితా తయారీకి సహకరించాలని మహానంది తహశీసిల్దార్ పి.రమాదేవి కోరారు. మంగళవారం మహానందిలోని తహశీల్దార్ కార్యాలయంలో సర్ కార్యక్రమంపై మండలంలోని రాజకీయ పార్టీ నాయకులతో అవగాహన సదస్సు నిర్వహించారు. తహసిల్దార్ మాట్లాడుతూ..కొత్త ఓట్లు నమోదు ప్రక్రియతో పాటు చనిపోయిన వారు ఓట్లు తీసివేయడం, ఓటరు పూర్తి వివరాలు డేటాలో పొందుపరిచే విధంగా ఈ కార్యక్రమాన్ని తీర్చిదిద్దడం జరిగిందన్నారు.ప్రతి పార్టీకి పిఎస్ కి ఒక్కరు చొప్పున బిఎల్ఎ లు, బి ఎల్ ఓ కలిసి మండలంలో ఉన్నటువంటి ప్రతి ఇంటికి వెళ్లి ప్రతి ఓటరు డేటా అప్లికేషన్ లో ఎంటర్ చేయించి వారి యొక్క సంతకాన్ని తీసుకుని అప్లికేషన్లు బిఎల్ఓ కి అందజేయాలని తెలిపారు.రాజకీయ పార్టీల నాయకులకు కార్యక్రమ ముఖ్యాంశాలను వివరించి, వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ప్రజలకు కార్యక్రమ ప్రయోజనాలు చేరేలా సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో రీ సర్వే డిప్యూటీ తాసిల్దార్ కామేశ్వర్ రెడ్డి,తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ కంచర్ల శివయ్య, మండల క్లస్టర్ ఇన్చార్జి నరాల చంద్రమౌళీశ్వర రెడ్డి, నాయకులు భాష్యం రాముడు గౌడ్, సర్పంచ్ అస్లాం భాష, గోపవరం సొసైటీ చైర్మన్ గంగవరపు ఉమామహేశ్వర్ రెడ్డి, హరి ప్రసాద్ రెడ్డి, గంగిశెట్టి మల్లికార్జున, కిలారి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# 20, 21 తేదీల్లో జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు



నంద్యాల (స్పోర్ట్స్): నంద్యాల నంది పైప్స్ బ్యాడ్మింటన్ అకాడమీ నందు జూన్ 20, 21 తేదీల్లో ఉమ్మడి జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వంశీధర్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ నెల 20వ తేదీ (శనివారం) అండర్-11, అండర్-13 విభాగాల్లో బాలబాలికలకు, 21వ తేదీ (ఆదివారం) అండర్-15, అండర్-17 విభాగాల క్రీడాకారులకు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అన్ని విభాగాల్లో సింగిల్స్, డబుల్స్ ఈవెంట్లలో పోటీలు నిర్వహించి జిల్లా జట్టును ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించే అవకాశం పొందుతారని వెల్లడించారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు తమ పుట్టిన తేదీ ధృవీకరణ పత్రం మరియు ఆధార్ కార్డును తప్పనిసరిగా వెంట తీసుకురావాలని సూచించారు. అలాగే తమ ఎంట్రీలను జూన్ 18వ తేదీలోగా నమోదు చేసుకోవాలని కోరారు.వివరాలకు కోచ్ నాగర్జున నెంబర్ 8985809434 ను సంప్రదించాలని కోరారు.

## రాష్ట్ర, జిల్లా నాయకుల సమక్షంలో కీలక చర్చలు

స్వాగతం పలికిన మార్కాపురం జిల్లా యం.ఆర్.మానవ హక్కుల సంఘం చైర్మన్ అండ్ సభ్యులు.





పల్లె వెలుగు మార్కాపురం విజయవాడ యం ఆర్ హ్యూమన్ రైట్స్ & యాంటీ కరప్షన్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు సుధీర్ కుమార్ మార్కాపురం విచ్చేసిన సందర్భముగా జిల్లా చైర్మన్ డాక్టర్ & అడ్వకేట్ ఎన్.వి. బి.యల్. కిరణ్ కుమార్ అధ్యక్షతన మీటింగ్ ఏర్పాటు చేయడము జరిగినది. ఈ కార్యక్రమములో పలు సమస్యల గురించి చర్చించుకుని తదుపరి వారిని శాలువాలతో సన్మానించడం జరిగినది. ఈ కార్యక్రమమునకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ కర్రా నాగిరెడ్డి, స్టేట్ చీఫ్ కోఆర్డినేటర్ పోలేపల్లి వెంకట లక్ష్మీనారాయణ, యర్రగొండపాలెం మండలం వైస్ ప్రెసిడెంట్ కోలా శ్రీనివాసరావు, చెన్నయ్య, మరి కొంతమంది పాల్గొనడము జరిగినది.

## కానాల గ్రామంలో ఖేత్ బచావో అభియాన్.



పల్లె వెలుగు నంద్యాల రూరల్. వ్యవసాయ కళాశాల, మహానంది అసోసియేట్ డీన్ డా. వి. జయలక్ష్మి ఆధ్వర్యంలో కానాల గ్రామంలో ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు భూసార పరీక్షల ప్రాముఖ్యత, వాటి ఫలితాల ఆధారంగా ఎరువుల వినియోగం, జీవ ఎరువుల వినియోగం, వ్యవసాయ సేంద్రీయ పదార్థాల సమీకృత వినియోగం, పచ్చిరొట్ట ఎరువుల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అదేవిధంగా నేల సారవంతత పెంపుదల, నేల కాలుష్య నివారణకు అనుసరించాల్సిన వివిధ పద్ధతులను రైతులకు వివరించారు. ఈ విధానాలను పాటించడం ద్వారా ఎరువుల వినియోగాన్ని తగ్గించడంతో పాటు నేల ఆరోగ్యాన్ని, సారవంతతను కాపాడుకోవచ్చని, వాతావరణ కాలుష్యాన్ని కూడా తగ్గించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డా. ఎం. జోత్స్నా కిరణ్మయి, డా. ఎస్. సింధుజా (అసిస్టెంట్ ప్రొఫెసర్, వ్యవసాయ ఆర్థిక శాస్త్రం), వి.ఎ.ఎ. సుదర్శన్ రెడ్డి, వ్యవసాయ కళాశాల విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

# నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయం నందు నెలవారి నేర సమీక్ష సమావేశం ఏర్పాటు.






పల్లె వెలుగు నంద్యాల క్రైమ్. నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్ నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో అన్నీ సబ్ డివిజన్ల పోలీసు అదికారులతో నెలవారి నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం నందు పోలీస్ స్టేషన్ల వారీగా పెండింగ్ కేసులు వాటి స్థితిగతులు, నమోదైన కేసుల్లో నిందితుల అరెస్టు, కేసుల దర్యాప్తు తీరుతెన్నులు వాటి పురోగతిపై సంబంధిత పోలీస్ అధికారులతో ఆరా తీసి కేసుల ఫైల్స్ ను క్షుణ్ణంగా పరిశీలించారు. పోలీస్ స్టేషన్ల వారీగా యు ఐ కేసులు తగ్గించుకోవాలన్నారు. నిర్ణీత గడువులోపు పెండింగ్ కేసులను పరిష్కార దశకు తీసుకురావాలన్నారు. హత్యలు, హత్యాయత్నాలు,క్రైమ్ అగైనెస్ట్ ఉమన్, ప్రాపర్టీ కేసులు, రోడ్డు ప్రమాదాలు తదితర కేసులను సమీక్ష చేశారు. నమోదైన కేసులలో సమగ్ర దర్యాప్తు నిర్వహించి నేరస్తులు తప్పించుకునే వీలు లేకుండా న్యాయ స్థానాలలో తగిన సాక్ష్యాధారాలు ప్రవేశపెట్టి నేరస్తులకు శిక్ష పడే విధంగా అన్నీ ఆదారాలు సేకరించి చార్జిషీట్ ధాకాలు చేయాలన్నారు. పోలీసు స్టేషన్లలో నమోదయ్యే కేసుల వివరాలను సి సి టి ఎన్ ఎస్ లో ఎప్పటికప్పుడు పొందుపరచాలని తెలిపారు. ఆయా కేసుల ఛేదింపునకు మరియు పరిష్కారానికి, నేర నియంత్రణకు దోహదం చేసే పలు సూచనలు మరియు మెళకువలను అధికారులకు తెలియజేశారు. హత్య కేసుల, పి ఓ సి ఎస్ ఓ కేసులు మరియు కేసులలో దర్యాప్తు వేగాన్ని పెంచాలని, హత్య మరియు ఇతర కీలకమైన కేసుల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని దర్యాప్తు సమగ్రంగా చేపట్టాలన్నారు. ప్రాపర్టీ నేరాల్లో నిందితులను త్వరగా పట్టుకొని దొంగిలించిన సొత్తును రికవరీ చేయాలన్నారు. దొంగతనాలు, దోపిడీలు, తదితర నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని ముఖ్యమైన ప్రదేశాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలకు వాటి ప్రాముఖ్యతను వివరిస్తూ కెమెరాలను ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. దొంగతనాలను అరికట్టేందుకు హైవే రహదారులపై వాహనాల తనిఖీలు చేస్తూ ప్రత్యేక చొరవ చూపాలని ,అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వేలి ముద్రలను తనిఖీ చేయాలి. ఏపీకె ఫైల్ ,లోన్ యాప్ ల మోసాల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి చైతన్యం చేయాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలైన మట్కా, పేకాట, అక్రమ మద్యం రవాణాపై ముందస్తు సమాచారం సేకరించి వీటిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గంజాయి వంటి నిషేధిత మాదకద్రవ్యాలను రవాణా మరియు విక్రయించే వారిపై ఎన్.డి.పి.ఎస్ కేసులు నమోదు చేయాలన్నారు. గంజాయి రవాణా పై ప్రత్యేక దృష్టి సారించి ఎన్ డి పి ఎస్ కేసులను డీఎస్పీ స్థాయి అధికారి పర్యవేక్షించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.అధికారులు ఎప్పటికప్పుడు మారుతున్న చట్టాలకు అనుగుణంగా అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాలను ఉపయోగించుకుని ప్రతి పోలీసు అధికారి బాధ్యతగా వ్యవహరించాలి పూర్తిస్థాయిలో విచారణ దర్యాప్తు చేసి ఖచ్చితమైన ఆధారాలతో కోర్టుకు సమర్పించి బాధితులకు సరైన న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమములో జిల్లా ఎస్పీ తో పాటు అడిషనల్ ఎస్పీ ఎన్ యగంధర్ బాబు ,నంద్యాల సబ్ డివిజన్ ఏ ఎస్ పి ఎం.జావళి ఐపీఎస్, డి.ఎస్.పి లు శ్రీనివాసరెడ్డి, రామంజనాయక్ , శ్రీనివాస్, శ్రీనివాసులు, పోలీసు అదికారులు పాల్గొన్నారు.

# రూ.40 వేల లంచంతో పంచాయతీ కార్యదర్శి అరెస్ట్

- అవినీతిపై ఏసీబీ ఉక్కుపాదం.
- రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ అధికారులు.



పల్లె వెలుగు వెల్దుర్తి. ప్రభుత్వ సేవలను అందించాల్సిన అధికారి లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు చిక్కిన ఘటన వెల్దుర్తిలో సంచలనం రేపింది. వెల్దుర్తి గ్రామ పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనాథ్ ఓ వ్యక్తి నుంచి రూ.40 వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఫిర్యాదుదారుడి పనిని పూర్తి చేయడానికి ప్రతిఫలంగా రూ.40 వేలు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు ముందస్తు ప్రణాళికతో ఏసీబీ అధికారులు ఉచ్చు వేసి, లంచం స్వీకరిస్తున్న సమయంలో కార్యదర్శిని పట్టుకున్నారు. అనంతరం ఆయన వద్ద నుంచి లంచం నగదును స్వాధీనం చేసుకుని, అవసరమైన రసాయన పరీక్షలు నిర్వహించారు. ఈ ఘటనతో గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతికి తావులేకుండా కఠిన చర్యలు కొనసాగుతాయని ఏసీబీ అధికారులు స్పష్టం చేశారు. నిందితుడిపై అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

# మత్తుతో యువత భవిష్యత్ చిత్తు

- అంగడి వీధి, కడప నందు "పోలీస్ కళా-జాగృతి బృందం" నాటక ప్రదర్శన కార్యక్రమంలో సి.కె దిన్నె సి.ఐ బాల మద్దిలేటి

-డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం అందరి బాధ్యత




కడప జూన్ 16. పల్లె వెలుగు: జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు మంగళవారం సాయంత్రం అంగడి వీధి, కడప నందు"పోలీస్ కళా-జాగృతి బృందం" ఇన్‌చార్జ్ జి.నరసరామ్ మరియు టీమ్ చే 'ఓయువతా... మేలుకో" నాటక, పాటల ప్రదర్శన ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సికె.దిన్నె సిఐ బాలమద్దిలేటి మాట్లాడుతూ నేటిసమాజంలో యువత "డ్రగ్స్"కు దూరంగా ఉండి వారి భవిష్యత్తును కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. మత్తుపదార్థాల వాడకంవల్ల వచ్చే ఆరోగ్య సమస్యలు, సమాజంలోని రుగ్మతలు వాటివలన కలిగే అనర్థాల గురించి వివరించారు. అలాగే తల్లిదండ్రులు అయిన మీరు మీ పిల్లలు విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హితవు పలికారు.మత్తుపదార్థాలు వాడిన, అమ్మిన, ఆశ్రయం కల్పించిన దానికి తగిన శిక్షలు గురించి తెలియజేశారు.మత్తు పదార్థాల ఆచూకీ తెలిసిన వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1972కి కాల్ చేసి తెలియజేయాలన్నారు.అలాగే ఈగల్ టీం ఆయాల్ ఖాన్, గురుశేఖర్ "యువతా మేలుకో-మత్తు నుండి తేరుకో, డ్రగ్స్ వద్దు- జీవితం ముద్దు, మత్తుపదార్థాలకు దూరంగా ఉండు- భవిష్యత్తును కాపాడుకుందాం" అని నినాదాలు చేయించారు.పోలీసు కళా-జాగృతి బృందం" ప్రదర్శన ప్రజలనుఅలరించింది.ఈకార్యక్రమంలో ఫ్యాక్షన్ జోన్ యస్.ఐ సుబ్రహ్మణ్యం, బృందసభ్యులు మరియు అంగడివీధి ప్రజలు పాల్గొన్నారు.

# పదవతరగతి ఉత్తమ విద్యార్థులను సన్మానించిన



నందవరం పల్లె వెలుగు జూన్16 గ్రామీణ ప్రాంత విద్యార్థులు చదువులో వెనకబడటానికి కారణం తల్లిదండ్రుల నిరక్షరాస్యత, పేదరికం ముఖ్య కారణం.అటువంటి గ్రామాల్లో విద్యార్థులను ప్రోత్సహించేందుకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కనకవీడు గ్రామానికి చెందిన గణిత ఉపాధ్యాయుడు నాగేంద్ర కుమార్ ప్రతి సంవత్సరం పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్, జిరాక్స్ , ఎగ్జామ్ కిట్స్ అందిస్తూ పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వారి ఉత్తీర్ణత లో ప్రత్యేక పాత్ర పోషిస్తున్నారని , ప్రతి సంవత్సరం పదవ తరగతి ఫలితాలలో 500 కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు 2000/- రూపాయల నగదును అందిస్తూ వారిని సన్మానిస్తూ , ప్రోత్సహిస్తున్నందుకు గ్రామ ప్రజలు నాగేంద్ర కుమార్ సార్ కు కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ 2025 -2026 విద్యా సంవత్సరం లో కూడా పదవ తరగతి పరీక్షా ఫలితాలలో కూడా 500 కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులు శిరీషమ్మ 532 , వీరేంద్ర 508, గీతాంజలి 505 మార్కులు సాధించారు.ఈ విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు ఆధ్వర్యంలో 2000 రూపాయల నగదును అందిస్తూ వారిని సన్మానిస్తూ తల్లిదండ్రులను అభినందించడం జరిగింది ప్రతి సంవత్సరం విద్యార్థులను ప్రోత్సహిస్తున్న గణిత ఉపాధ్యాయుడు నాగేంద్ర కుమార్ ను ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు అభినందించారు. కార్యక్రమం లో పాఠశాల ఉపాధ్యాయులు విజయ్ , రాము, శంకర్, విజయ్ కుమార్, గురు ప్రసాద్ , రాజశేఖర్ , రామాంజనేయులు, నాగరాజు , శ్రీనివాసులు మరియు గ్రామ ప్రజలు ఉరుకుందు , హనుమంతు , నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

# హై డెన్సిటీ ప్లాంటేషన్‌తో పచ్చదనానికి ప్రాధాన్యం ఇవ్వాలి.

**ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలను మోడల్ గ్రీన్ క్యాంపస్‌లుగా తీర్చిదిద్దాలి.**

- **జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి**



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో హై డెన్సిటీ ప్లాంటేషన్‌ను విస్తృతంగా చేపట్టి పచ్చదనం పెంపొందించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ ఛాంబర్‌లో హై డెన్సిటీ ప్లాంటేషన్ కార్యక్రమాల అమలుపై సంబంధిత శాఖల అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ సూర్యనారాయణ,



సాంఘిక సంక్షేమ శాఖ అధికారి చింతామణి, డీఈఓ జనార్ధన్ రెడ్డి, హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ప్రతినిధులు శర్వానన్ సుబ్రమణ్యం, జయసూర్య, ఆశ్రిత, అంకిత కుమారి, రాజశేఖర్, శరత్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలు మరియు వసతి గృహాల ప్రాంగణాల్లో హై డెన్సిటీ ప్లాంటేషన్ ద్వారా పర్యావరణహిత వాతావరణాన్ని సృష్టించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలో ఒక పాఠశాలను ఎంపిక చేసి సోక్ పిట్స్, వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థలు, వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలు, సోలార్ సదుపాయాలు తదితర అంశాలను సమగ్రంగా ఏర్పాటు చేసి దానిని ఆదర్శ గ్రీన్ మోడల్ పాఠశాలగా అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు.

అదేవిధంగా రాతినేలలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో కూడా హై డెన్సిటీ ప్లాంటేషన్ విజయవంతంగా అమలు చేయడానికి అనువైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని, అందుకు అవసరమైన సాంకేతిక సూచనలు అందించాలని హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ప్రతినిధులను కోరారు. హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ప్రతినిధి శర్వానన్ సుబ్రమణ్యం మాట్లాడుతూ, వర్షాకాలంలో లభించే నీటిని సమర్థవంతంగా నిల్వ చేసుకోవడం అత్యంత అవసరమన్నారు. నీటి సంరక్షణ, భూగర్భ జలాల పునరుద్ధరణ, వర్షపు నీటి నిర్వహణ కార్యక్రమాలను విస్తృత స్థాయిలో అమలు చేయడం ద్వారా జిల్లాలో పచ్చదనం గణనీయంగా పెరిగే అవకాశముందని పేర్కొన్నారు.

# ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తాం

- **రెండేళ్లలో అభివృద్ధి సంక్షేమాల్లో అద్భుత ప్రగతి**
- **డోన్ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం డోన్ ఎమ్మెల్యే కోట్ల**





పల్లె వెలుగు –డోన్ ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తామని డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి అన్నారు.ప్రజల ఆశీస్సులతో ఏర్పడిన కూటమి ప్రభుత్వం విజయవంతంగా రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా డోన్ పట్టణంలో "2 ఏళ్ల నమ్మకం -- అభివృద్ధి -- సంక్షేమం" విజయోత్సవ సభను మంగళవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని సాయి ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

*ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు*



*అనుగుణంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం గత రెండు సంవత్సరాలుగా అభివృద్ధి, సంక్షేమాలను రెండు కళ్లుగా చేసుకుని ముందుకు సాగుతోందని కొనియాడారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తి చిత్తశుద్ధితో పనిచేస్తోందని స్పష్టం చేశారు.*

**మౌలిక సదుపాయాలు, సంక్షేమానికి పెద్దపీట:**

రాష్ట్రవ్యాప్తంగా మౌలిక సదుపాయాల అభివృద్ధి, విద్య, వైద్యం, తాగునీరు, రహదారుల నిర్మాణం, మహిళా సాధికారత, యువతకు ఉపాధి కల్పన వంటి రంగాలకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజల జీవితాల్లో సానుకూల మార్పులు తీసుకురావడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. డోన్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఎమ్మెల్యే కోట్ల వివరించారు. నియోజకవర్గంలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అంతర్గత రహదారులు, డ్రైనేజీలు, తాగునీటి సదుపాయాలు, పారిశుధ్య పనుల మెరుగుదలతో పాటు సంక్షేమ కార్యక్రమాల అమలులో విశేష పురోగతి సాధించామని లెక్కింపజేశారు. రానున్న రోజుల్లో మరిన్ని నిధులు కేటాయించి, డోన్ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఒక ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు అహర్నిశలూ కృషి చేస్తామని వెల్లడించారు. ప్రభుత్వంపై నమ్మకంతో సహకరిస్తున్న ప్రజలందరికీ ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలియజేస్తూ, ప్రగతి ఫలాలు ప్రతి కుటుంబానికి చేరేలా నిరంతరం శ్రమిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు కోట్ల రాఘవేంద్ర రెడ్డి, డోన్ నియోజకవర్గ అబ్జర్వర్ గోవర్ధన్ రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్, ఆర్డీవో నరసింహులు, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడ్, ఎంపీడీవోలు శ్రీనివాసులు, ఫజల్ రెహమాన్, వలసల రామకృష్ణ, డోన్ మార్కెట్ యార్డ్ చైర్మన్ రాజారేణుక, ఖాజా పీర్, కుమ్మరి సుధాకర్,కొంగణపల్లె మధు,కేశవయ్య గౌడ్, రాఘవేంద్ర గౌడ్, రఫీ, ఆర్ ఇ నాగరాజు పాల్గొన్నారు.

# మా పొలాన్ని కబ్జా చేసిన వారిని చట్టపరమైన, చర్యలు తీసుకోండి

- **రికార్డులు ప్రకారమే న్యాయం చేయండి**
- **రైతు రంగారెడ్డి**



నందవరం పల్లె వెలుగు జూన్ 16 నందవరం మండల పరిధిలోని కనకవీడు గ్రామంలో బనవాసి రంగారెడ్డి, నాగన్న మాట్లాడుతూ, 1962లో దేవర తాయప్ప 57 ఎకరాల 60 సెంట్లు 1972 నుండి నాగేశ్వరరావు 2015లో, 2024 లో రంగారెడ్డి ఐపీ ఆర్ నెంబర్ 17,4,34/24



డాక్యుమెంట్ మూడు సంవత్సరం అనంతరం వీరన్న గౌడ్ నారాయణ గౌడ్, శేషన్న గౌడ్ అజయ్ గౌడ్ చంద్రశేఖర్ గౌడ్ వెంకటేశ్వర్లు దస్తగిరి నల్లారెడ్డి సురేష్ లక్ష్మి ఈరమ్మ వీరు మాపై దుర్భాషలాడుతూ అక్రమంగా దౌర్జన్యం చేస్తూ 2024 సంవత్సరంలో పొలాన్ని దున్ని విత్తనాలు వేసుకున్నారు. మేము కూడా రైతులమే భూమిలో వేసిన విత్తనాలు చెడపడం మంచిది కాదని ఉద్దేశంతో ఆ సంవత్సరము పొలాన్ని వారికే వదిలేశామని తెలిపారు. 2026 సంవత్సరంలో కూడా పొలాన్ని దున్నినాము, అక్రమంగా రైతులు పొలాన్ని దున్ని పంట పొలం వేశారు. మా పొలాన్ని మేము దున్ని సాగు చేశామని తెలిపారు. మాకు ఇంజక్షన్ ఆర్డర్ అడంగల్ ఆర్వార్ డాక్యుమెంట్ రిజిస్టర్ పత్రాలు మా దగ్గర ఉన్నాయని తెలిపారు. నాగేశ్వర్ రెడ్డి నుండి 15 ఎకరాలు పొలాన్ని బనవాసి రంగారెడ్డి సర్వే నెంబరు 124 బి భూమిని ఆరున్నర లక్షలకు కొనుగోలు చేశామని తెలిపారు. మా పొలాన్ని కబ్జాకు గురి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని మాకు న్యాయం చేయాలని తెలిపారు.

# కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన

**- నంద్యాల టెక్కె మార్కెట్ యార్డ్‌లో భారీ బహిరంగ సభ : మంత్రి ఎన్ఎండి ఫరూక్.**



పల్లె వెలుగు నంద్యాల క్రైమ్. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా, నంద్యాల జిల్లాలో ఘనంగా సంబరాలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ సందర్భంగా రేపు, జూన్ 17న నంద్యాల టెక్కె మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్, జిల్లా కలెక్టర్ రాజకుమారి, జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ తెలిపారు . ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని ఆయన పార్టీ శ్రేణులను, ప్రజలను కోరారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో ఈ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ భారీ బహిరంగ సభకు జరుగుతున్న ఏర్పాట్లను మంత్రి ఎన్ఎండి ఫరూక్, జిల్లా కలెక్టర్ రాజకుమారి, జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ స్వయంగా పర్యవేక్షించారు. టెక్కె మార్కెట్ యార్డ్ వేదిక వద్ద జరుగుతున్న పనులను క్షుణ్ణంగా పరిశీలించి , సభకు వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు, మున్సిపల్ కమిషనర్ శేషన్న, ఎమ్మార్వోలు శ్రీనివాసులు, శ్రీవాణి మరియు అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# పశువైద్య కేంద్రాలను తనిఖీ చేసిన ఏడి డాక్టర్ వెంకటేశ్వర్లు



బండి ఆత్మకూరు పల్లె వెలుగు జూన్ 16 : వెలుగోడు సబ్ డివిజన్ పశు వైద్య శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ వెంకటేశ్వర్లు మంగళవారం బండి ఆత్మకూరు ఏ కోడూరు పశు వైద్య కేంద్రాలను సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ పశుపోషకులు పశువుల సంతాన ఉత్పత్తిని పెంచుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అన్నారు. ఈ సందర్భంగా పశు వైద్య కేంద్రాలలో పశువుల మంద సంతానోత్పత్తి పుస్తకాన్ని ఆవిష్కరించారు. పశువులలో ఎద సమయాన్ని తగ్గించి తద్వారా సంతాన ఉత్పత్తి ని పెంచుకుంటే సంతాన ఉత్పత్తి పెరిగి పాడి పశుపోషకులకు ఆర్థికంగా ప్రయోజనం చేపడుతుందని తెలిపారు. జంతు ప్రజన కేంద్రీయత విధానం ద్వారా పశువులలో ఆరోగ్యకరమైన సంతానాన్ని ఉత్తమ లక్షణాలతో పాటు ఉత్పాదకతను పెంచాలని పశువైద్యాధికారులకు సూచించారు. గుర్తించిన పశువుల వివరాలను హార్ట్ ఫెర్టిలిటీ బుక్కులో నమోదు చేయాలని అన్నారు. దీని ద్వారా రైతులకు ఆర్థిక రావడంలను పెంపొందించడంతోపాటు పశువులలో జన్యుపరమైన మెరుగుదలలు పునరుత్పత్తి సామర్థ్యాన్ని మెరుగుపరచడంతో పాటు వ్యాధి నిరోధకతను పెంచుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారులు డాక్టర్ జోష్నా దేవి డాక్టర్ అనూష తోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

## తాగునీటి సమస్య పరిష్కారానికి మరో కీలక అడుగు ఎమ్మెల్యే





పల్లెవెలుగు –డోన్ డోన్ పట్టణ ప్రజల దశాబ్దాల తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా మరో కీలక అడుగు పడిందని డోన్ ఎమ్మెల్యే స్పష్టం చేశారు. మంగళవారం వాటర్ గ్రిడ్' ప్రాజెక్టులో భాగంగా... డోన్ కొండపైన నూతనంగా ఏర్పాటు చేసిన 630 ఖవా ట్రాన్స్‌ఫార్మర్ యార్డ్ 1200 ఖు క్లియర్ వాటర్ పంప్ హౌస్‌కు విద్యుత్ సరఫరాను అధికారికంగా ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... డోన్ పట్టణంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం అత్యంత కట్టుబడి పనిచేస్తోందని స్పష్టం చేశారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగిన మౌలిక వసతులు కల్పించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. "వాటర్ గ్రిడ్‌కు విద్యుత్ సరఫరా ప్రారంభం కావడంతో ప్రాజెక్టు పనులు మరింత వేగవంతం అవుతాయని రాబోయే రోజుల్లో డోన్ పట్టణ ప్రజలందరికీ మెరుగైన, నాణ్యమైన తాగునీటి సేవలు నిరంతరాయంగా అందుబాటులోకి వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో వలసల రామకృష్ణ, సలీంద్ర శ్రీనివాసులు, ఆర్డబ్ల్యూఎస్ డీఈ రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 18న పారిశుద్ధ్య కార్మికులతో 'యోగాంధ్ర'

**కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు**



పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ : ఈ నెల 18న ఎస్ఏపి క్యాంపు వద్ద నగరపాలక పారిశుద్ధ్య కార్మికులకు యోగాంధ్ర కార్యక్రమం జరుపనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. మంగళవారం ఆయన ఎస్ఏపి క్యాంపులో ఏర్పాట్లపై అధికారులతో కలిసి పరిశీలించారు. ఉదయం 6 గంటలకు కార్యక్రమాన్ని నిర్వహించడం, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరవుతున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా కప్పల్ నగర్, అశోక్ నగర్, వై.జంక్షన్, వీకర్ సెక్షన్ కాలనీ తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. అనంతరం పరిమళ నగర్‌లోని అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో డియస్‌పి మాహబూబ్ బాష, ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం.రఘు, ఎస్ఈ రమణమూర్తి, ఎంఈ గిరిరాజ్, డిఈఈ శ్రీనివాసన్, ఏఈ వైష్ణవి, ఖాసిం, శానిటేషన్ సూపర్వైజర్ రమేష్, ఇంస్పెక్టర్లు ఆలీం బాష, మునిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

### 2002 ఓటర్ల జాబితాతో మ్యాపింగ్ ప్రక్రియ కొనసాగుతుంది

## తాసిల్దార్ జ్యోతి రత్నకుమారి



ఆళ్లగడ్డ ప్రతినిధి జూన్ 16, పల్లె వెలుగు ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా ఆళ్లగడ్డ తహశీల్దార్ జ్యోతి రత్నకుమారి మంగళవారం పాతకందుకూరు, చింతకొమ్మదిన్నె, చింతకుంట గ్రామాల్లో పర్యటించి, బూత్ లెవెల్ అధికారుల (బిఎల్ఓ) ద్వారా ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ చేసి, ఓటర్ల డేటా డిజిటలైజేషన్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం తహశీల్దార్ జ్యోతి రత్నకుమారి మాట్లాడుతూ 2002 జాబితాతో ఓటర్ల మ్యాపింగ్, ఓటర్ల జాబితా పారదర్శకతలో భాగంగా ప్రస్తుత ఓట్లను 2002 నాటి ఓటర్ల జాబితాతో మ్యాపింగ్ చేసే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ఈ ప్రక్రియ కోసం బిఎల్ఓ లు మీ ఇంటికి వచ్చినప్పుడు, ఓటర్లు వారికి సరైన సమాచారం ఇచ్చి సహకరించాలన్నారు. అలాగే ప్రతి ఓటరు విధిగా తమ పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోను బిఎల్ఓ కు అందజేయాలన్నారు. కాబట్టి ప్రజలందరూ ముందుగానే తమ ఫోటోలతో సిద్ధంగా ఉండాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో ఓబులేష్ ,సూపర్ వైజర్లు, బిఎల్ఓ లు తదితరులు పాల్గొన్నారు.

# బీట్ రూట్ జ్యూస్‌ను అసలు రోజూ ఎంత మోతాదులో తాగాలి..?

# ఏ సమయంలో తాగితే మంచిది..?

బీట్ రూట్ మనకు ఏడాది పొడవునా అన్ని సీజన్లలోనూ అందుబాటులో ఉంటుంది. బీట్‌రూట్‌ను కొందరు వేపుడు చేస్తారు. కొందరు కూరగా చేసుకుని తింటే కొందరు సలాడ్ రూపంలో తింటారు. బీట్‌రూట్‌ను తినడం వల్ల మనకు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. బీట్ రూట్‌లో నైట్రేట్స్ అధికంగా ఉంటాయి. ఇవి మన శరీరంలో నైట్రిక్ ఆక్సైడ్‌గా మారుతాయి. ఇవి మనకు అనేక లాభాలను అందిస్తాయి. బీట్‌రూట్‌ను నేరుగా తినడం ఇష్టం లేకపోతే దాన్ని జ్యూస్‌గా చేసుకుని రోజూ తాగవచ్చు. రోజూ కనీసం 100 ఎంఎల్ మోతాదులో బీట్‌రూట్ జ్యూస్‌ను తాగితే చాలు, అనేక లాభాలు కలుగుతాయి. బీట్ రూట్ జ్యూస్‌ను సాధారణంగా ఉదయం సేవిస్తే మంచిది. దీంతో అనేక లాభాలను పొందవచ్చు. శరీరానికి పోషకాలు లభిస్తాయి. ఆరోగ్యంగా ఉంటారు. వ్యాధుల నుంచి బయట పడతారు.

### గుండె ఆరోగ్యానికి..



బీట్ రూట్ జ్యూస్‌ను తాగడం వల్ల శరీరానికి నైట్రేట్స్ లభించి మన శరీరంలో అవి నైట్రిక్ ఆక్సైడ్‌గా మారుతాయి. ఇవి బీపీని తగ్గిస్తాయి. రక్త నాళాలను ప్రశాంతంగా మారుస్తాయి. దీని వల్ల రక్త



సరఫరా మెరుగు పడుతుంది. బీపీ తగ్గుతుంది. హైబీపీ ఉన్నవారికి ఈ జ్యూస్ ఎంతగానో మేలు చేస్తుంది. దీని వల్ల గుండె ఆరోగ్యం సైతం మెరుగు పడుతుంది. హార్ట్ ఎటాక్ రాకుండా నివారించవచ్చు. బీట్ రూట్ జ్యూస్‌ను తాగితే అందులో ఉండే నైట్రేట్స్ మన శరీరంలో నైట్రిక్ ఆక్సైడ్‌గా మారి మన శరీరంలోని కణాలకు ఆక్సిజన్ సరఫరాను మెరుగు పరుస్తాయి. దీంతో కణాలకు ఆక్సిజన్ సరిగ్గా సరఫరా అవుతుంది. ఫలితంగా శరీర శక్తి సామర్థ్యాలు పెరుగుతాయి. నీరసం, అలసట తగ్గుతాయి. శారీరక శ్రమ చేసేవారికి, వ్యాయామం చేసే వారికి బీట్ రూట్ జ్యూస్ ఎంతో మేలు చేస్తుంది. దీని వల్ల శరీరానికి మళ్లీ చురుకుదనం వస్తుంది. మళ్లీ ఎలాంటి అలసట లేకుండా పని చేయగలుగుతారు.

### షుగర్ సమస్యకు..

బీట్ రూట్‌లో బీటాలెయిన్స్, ఫ్లేవనాయిడ్స్ అనే సమ్మేళనాలు ఉంటాయి. ఇవి గుండె పనితీరును మెరుగు పరుస్తాయి. శరీరంలో అంతర్గతంగా వచ్చే వాపులను తగ్గిస్తాయి. ఆక్సీకరణ ఒత్తిడి నుంచి బయట పడేస్తాయి. దీని వల్ల గుండె జబ్బులు రాకుండా చూసుకోవచ్చు. బీట్ రూట్ చాలా తక్కువ గ్లైసీమిక్ ఇండెక్స్ విలువను కలిగి ఉంటుంది. ఫైబర్ అధికంగా ఉంటుంది. కనుక ఈ జ్యూస్‌ను తాగితే రక్తంలో షుగర్ లెవల్స్ నెమ్మదిగా పెరుగుతాయి. డయాబెటిస్ నియంత్రణలో ఉంటుంది. టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారికి ఈ జ్యూస్ ఎంతగానో



మేలు చేస్తుంది. దీన్ని తాగడం వల్ల శరీరం ఇన్సులిన్‌ను మెరుగ్గా ఉపయోగించుకుంటుంది. దీంతో షుగర్ అదుపులో ఉంటుంది. బీట్ రూట్‌లో అధికంగా ఉండే బీటాలెయిన్స్ అనే యాంటీ ఆక్సిడెంట్లు కణాలకు జరిగే నష్టాన్ని నివారిస్తాయి. వాపులకు గురికాకుండా చూస్తాయి. దీని వల్ల ఆర్థరైటిస్ నుంచి బయట పడవచ్చు.

### ఏ సమయంలో తాగాలి..?

బీట్ రూట్‌లో ఉండే బీటాలెయిన్ అనే సమ్మేళనం వల్ల లివర్ ఆరోగ్యంగా ఉంటుంది. శరీరంలోని వ్యర్థాలు బయటకు వెళ్లిపోతాయి. శరీరం అంతర్గతంగా శుభ్రంగా మారుతుంది. బీట్ రూట్ జ్యూస్‌ను రోజూ ఉదయం పరగడుపునే సేవించాలి. వ్యాయామం చేసేవారు, శారీరక శ్రమ చేసేవారు తమ పనులకు ఒక గంట ముందు ఈ జ్యూస్‌ను తాగితే మేలు జరుగుతుంది. బీపీ ఉన్నవారు ఈ జ్యూస్‌ను రోజుకు 200 ఎంఎల్ వరకు తాగవచ్చు. కానీ బీట్ రూట్ జ్యూస్‌ను అధికంగా సేవిస్తే విరేచనాలు అయ్యే అవకాశాలు ఉంటాయి. కనుక అలాంటి వారు ఈ జ్యూస్‌కు దూరంగా ఉండాలి. బీపీ ఉన్నవారు ఉదయం ఈ జ్యూస్‌ను సేవించాలి. దీని వల్ల బీపీ నియంత్రణలో ఉంటుంది. ఇలా బీట్ రూట్ జ్యూస్‌ను తాగడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు.

## ఎండు కొబ్బరిని తినడం వల్ల ఎన్ని లాభాలు కలుగుతాయో తెలుసా..?

## రోజూ ఎంత మోతాదులో తినాలంటే..?

ఎండు కొబ్బరిని మనం తరచూ వంటల్లో వేస్తుంటాం. దీంతో కూరలు చక్కని రుచి, రంగును కలిగి ఉంటాయి. ఎండు కొబ్బరిని స్వీట్ల తయారీలోనూ ఉపయోగిస్తుంటారు. ఎండు కొబ్బరితో తయారు చేసే స్వీట్లు ఎంతో రుచిగా ఉంటాయి. ఎండు కొబ్బరిలో అనేక ఆరోగ్యకరమైన కొవ్వులు ఉంటాయి. ఇవి మనకు అనేక లాభాలను అందిస్తాయి. ఈ కొబ్బరిలో ఫైబర్, మినరల్స్ కూడా ఉంటాయి. దీని వల్ల మన శరీరానికి పోషణ లభిస్తుంది. ఎండు కొబ్బరిలో మీడియం చెయిన్ ట్రై గ్లిజరైడ్స్ (%వీఋం%) ఉంటాయి. ఇవి మనకు ఆరోగ్యకరమైన ప్రయోజనాలను అందిస్తాయి. రోజూ ఎండు కొబ్బరిని నేరుగా కూడా తినవచ్చు. దీంతో అనేక లాభాలను పొందవచ్చు. ఎండు కొబ్బరిని తినడం వల్ల అందులో ఉండే లారిక్ యాసిడ్ శరీరంలో చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతుంది. దీని వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది.

### %జీర్ణ వ్యవస్థకు..

ఎండు కొబ్బరిలో ఫైబర్ అధికంగా ఉంటుంది. అందువల్ల దీన్ని తింటే రోజూ మనకు కావల్సిన ఫైబర్ సులభంగా లభిస్తుంది. దీని వల్ల మలబద్ధకం తగ్గుతుంది. ఎండు కొబ్బరి ప్రీ బయోటిక్ ఆహారంగా పనిచేస్తుంది. ఇది జీర్ణ వ్యవస్థలో మంచి బ్యాక్టీరియాను వృద్ధి చేస్తుంది. దీని వల్ల జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. ఎండుకొబ్బరిలో ఉండే ఎంసీటీలు లివర్‌లో శక్తిగా మార్పబడతాయి. కనుక దీన్ని తింటే శరీరానికి తక్షణమే శక్తి లభిస్తుంది. శరీర మెటబాలిజం పెరుగుతుంది. శారీరక శ్రమ లేదా వ్యాయామం చేసేవారు, అథ్లెట్లకు మేలు జరుగుతుంది. ఎంత పనిచేసినా అలసట, నీరసం రావు. శరీరంలో శక్తి స్థాయిలు అధికంగా ఉంటాయి. ఉత్సాహంగా ఉంటారు. చురుగ్గా పనిచేస్తారు. ఎండు కొబ్బరిలో అనేక రకాల మినరల్స్ ఉంటాయి. ఇందులో ఉండే మాంగనీస్ ఎముకలను ఆరోగ్యంగా ఉంచుతుంది. మెటబాలిజం పెరిగేలా చేస్తుంది.

### రక్తం వృద్ధి చెందేందుకు..

ఎండు కొబ్బరిలో అధికంగా ఉండే కాపర్ రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. ఎర్ర రక్త కణాలు నిర్మాణం అయ్యేలా చేస్తుంది. మనం తిన్న ఆహారాల్లో ఉండే ఐరన్‌ను శరీరం శోషించుకునేలా చేస్తుంది. దీంతో రక్తం వృద్ధి చెందుతుంది. రక్తహీనత తగ్గుతుంది. ఎండు కొబ్బరిలో ఉండే ఐరన్ మనల్ని ఉల్లాసంగా మార్చి ఉత్తేజంగా ఉండేలా చేస్తుంది. నీరసం, అలసటను తగ్గిస్తుంది. ఎండు కొబ్బరిలో



సమృద్ధిగా ఉండే ఫైబర్ వల్ల మనం తిన్న ఆహారంలో ఉండే పిండి పదార్థాలు రక్తంలో నెమ్మదిగా గ్లూకోజ్‌గా మారుతాయి. దీని వల్ల షుగర్ లెవల్స్ పెరగకుండా ఉంటాయి. డయాబెటిస్ నియంత్రణలో ఉంటుంది. టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారికి మేలు జరుగుతుంది. ఇలా ఎండు కొబ్బరిని తినడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు.

### ఎంత తినాలి..?

ఎండు కొబ్బరి ఆరోగ్యకరమే అయినప్పటికీ దీన్ని రోజూ మోతాదులోనే తినాల్సి ఉంటుంది. రోజుకు 2 టేబుల్ స్పూన్ల వరకు అంటే 15 నుంచి 30 గ్రాముల మేర తినవచ్చు. దీన్ని బెల్లంతో కలిపి తింటే ఇంకా మంచిది. దీని వల్ల పోషకాలను అధికంగా పొందవచ్చు. తురిమిన ఎండుకొబ్బరిలో క్యాలరీలు అధికంగా ఉంటాయి. కనుక ఎండు కొబ్బరి తినదలిస్తే నేరుగా తింటేనే మంచిది. ఎండు కొబ్బరిలో శాచురేటెడ్ కొవ్వులు అధికంగా ఉంటాయి. అమెరికన్ హార్ట్ అసోసియేషన్ చెబుతున్న ప్రకారం మనకు రోజుకు లభించే క్యాలరీల్లో 5 శాతం వరకు క్యాలరీలు మాత్రమే శాచురేటెడ్ కొవ్వుల ద్వారా లభించాలి. కనుక కొలెస్ట్రాల్ లేదా గుండె జబ్బులు ఉన్నవారు డాక్టర్ సూచన మేరకు మాత్రమే ఎండు కొబ్బరిని తినాల్సి ఉంటుంది. ఎండు కొబ్బరిని ఎట్టి పరిస్థితిలోనూ చక్కెరతో కలిపి తినకూడదు.

## జీలకర్ర నీళ్లను రోజూ పరగడుపునే తాగితే కలిగే అద్భుతమైన లాభాలు ఇవే..!

జీలకర్ర మనందరి ఇళ్లలోనూ ఉంటుంది. దీన్ని ఎంతో కాలంగా వంట ఇంటి పదార్థంగా ఉపయోగిస్తున్నారు. జీలకర్రను రోజూ మనం వంటల్లో వేస్తుంటాం. ఇది చక్కని సువాసనను కలిగి ఉంటుంది. జీలకర్రను తినడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. అయితే దీన్ని నేరుగా తినలేరు. కానీ జీలకర్రను నీటిలో వేసి మరిగించి ఆ నీళ్లను ఉదయం పరగడుపునే తాగవచ్చు. రోజూ ఉదయం పరగడుపునే జీలకర్ర నీళ్లను ఒక కప్పు మోతాదులో తాగాల్సి ఉంటుంది. దీంతో అనేక లాభాలు కలుగుతాయి. జీలకర్రలో కుమినాల్డిహైడ్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది జీర్ణాశయ ఎంజైమ్‌లు ఉత్పత్తి అయ్యేలా చేస్తుంది. దీని వల్ల మనం తిన్న ఆహారం సులభంగా జీర్ణం అవుతుంది. పరగడుపునే జీలకర్ర నీళ్లను తాగడం వల్ల అజీర్తి, కడుపు ఉబ్బరం, గ్యాస్, కడుపు నొప్పి వంటి జీర్ణ సమస్యలు తగ్గుతాయి. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది.



## నిద్రించేటప్పుడు ఎడమ వైపు తిరిగి పడుకోవాలా..?

## కుడి వైపు తిరిగి పడుకుంటే ఏమవుతుంది..?



రాత్రి పూట నిద్రించేటప్పుడు చాలా మంది వివిధ రకాల భంగిమల్లో నిద్రిస్తుంటారు. కొందరు కేవలం వెల్లకిలా మాత్రమే పడుకుంటారు. కొందరు బోర్లా పడుకుంటారు. కొందరు మాత్రం ఏదైనా ఒక వైపు తిరిగి మాత్రమే నిద్రిస్తారు. అయితే రాత్రి పూట కేవలం ఎడమ వైపు తిరిగి మాత్రమే నిద్రించాలని, అలా నిద్రిస్తేనే మనకు ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని ఆరోగ్య నిపుణులు చెబుతుంటారు. ఆయుర్వేద కూడా ఇదే విషయాన్ని సూచిస్తుంటుంది. అయితే ఇందులో నిజం ఎంత ఉంది..? రాత్రి పూట ఎడమ వైపు తిరిగి మాత్రమే నిద్రించాలా..? కుడి వైపు తిరిగి నిద్రిస్తే ఏమవుతుంది..? వంటి వివరాలను ఇప్పుడు తెలుసుకుందాం. ఎడమ వైపు తిరిగి నిద్రించడం వల్ల అనేక లాభాలు కలుగుతాయని వైద్య నిపుణులు చెబుతున్నారు.

%ఎడమ వైపు తిరిగి నిద్రిస్తే..

ఎడమ వైపు తిరిగి నిద్రిస్తే జీర్ణాశయం, క్లోమగ్రంథి అదే వైపు ఉంటాయి కనుక గురుత్వాకర్షణ శక్తి వల్ల జీర్ణక్రియ మరింత వేగంగా కొనసాగుతుంది. దీని వల్ల ఆహారం సులభంగా జీర్ణాశయం నుంచి పేగుల్లోకి కదులుతుంది. దీంతో అజీర్తి, కడుపు ఉబ్బరం, గుండెల్లో మంట వంటి సమస్యలు తగ్గుతాయి. గ్యాస్ట్రో ఎసోఫేజియల్ రిఫ్లక్స్ డిసీజ్ (%+జు=ణ%) అనే సమస్య ఉన్నవారు కచ్చితంగా ఎడమ వైపు తిరిగి నిద్రించాలని వైద్యులు చెబుతుంటారు. ఎందుకంటే దీని వల్ల ఎంతగానో ఉపశమనం లభిస్తుంది. జీర్ణాశయం ఆహారనాళం కింద ఉంటుంది. దీని వల్ల జీర్ణాశయంలోని ఆమ్లాలు తిరిగి ఆహారనాళంలోకి రాకుండా ఉంటాయి. దీంతో %+జు=ణ% నుంచి ఉపశమనం లభిస్తుంది. మాటి మాటికీ ఆహారం వల్ల త్రేన్పులు రాకుండా ఉంటాయి.

గుండె ఆరోగ్యానికి..

మన శరీరంలోని అతిపెద్ద రక్తనాళం అయిన అరోటా గుండెకు ఎడమ వైపు ఉంటుంది. కనుక ఎడమ వైపు తిరిగి నిద్రిస్తే గురుత్వాకర్షణ శక్తి వల్ల శరీరానికి రక్త సరఫరా మెరుగు పడుతుంది. దీంతో గుండెపై పడే భారం తగ్గుతుంది. అలాగే లింఫ్ వ్యవస్థ సక్రమంగా పనిచేస్తుంది. శరీరంలో ఉండే వ్యర్థాలు సులభంగా బయటకు వెళ్లిపోతాయి. గర్భంతో ఉన్న మహిళలు ఎడమ వైపు తిరిగి నిద్రించాలని వైద్యులు సూచిస్తుంటారు. దీని వల్ల గర్భంలో ఉన్న శిశువు భంగిమ సరిగ్గా ఉంటుంది. శిశువుకు రక్త సరఫరా మెరుగు పడుతుంది. లివర్‌పై పడే భారం తగ్గుతుంది. తీవ్రమైన వెన్ను నొప్పి సమస్య ఉన్నవారు ఎడమ వైపు తిరిగి నిద్రిస్తే వెన్నెముకపై పడే ఒత్తిడి తగ్గుతుంది. దీంతో రక్త సరఫరా మెరుగుపడి వెన్ను నొప్పి తగ్గుతుంది.

కుడి వైపు తిరిగితే..

అయితే ఎడమ వైపు తిరిగి మాత్రమే నిద్రించాలా.. కుడి వైపు తిరిగి నిద్రించకూడదా.. మాకు కుడివైపు మాత్రమే బాగా అలవాటు ఉంది అనుకునేవారు తమ సౌకర్యానికి అనుగుణంగా నిద్రించవచ్చు. కుడి వైపు నిద్రించడం వల్ల ఎలాంటి హాని జరగదు. కానీ %+జు=ణ% సమస్య ఉన్నవారు, గుండె ఆరోగ్యం కోసం, గర్భిణీలు ఎడమ వైపు తిరిగి నిద్రిస్తేనే మంచిదని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఇలాంటి సందర్భాల్లో సౌకర్యం కన్నా ఆరోగ్య ప్రయోజనాలు ముఖ్యమని వారు అంటున్నారు. ఇక కుడి వైపు నిద్రించడం అలవాటు అయిన వారు అంత త్వరగా ఎడమ వైపును మార్చుకోలేరు. కానీ అలాంటి వారు కొన్ని రోజులు కష్టపడితే ఎడమ వైపు తిరిగి నిద్రించడం పెద్ద కష్టమేమీ కాదు. కనుక ఎడమ వైపు తిరిగి నిద్రిస్తే అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

